మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు
# ప్రజా మంటలు
తెలంగాణ జాతీయ దినపత్రిక
సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 54 వెల - రూ 5:00
Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు
Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag
Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



# మోదీ ధనికులకు ఇచ్చిన డబ్బును.. పేదల ఖాతాల్లో వేస్తాం: రాహుల్



**భాజపా గెలిస్తే..ప్రమాదంలో రాజ్యాంగం - రద్దు చేసేందుకు రంగం సిద్ధం**

- అందుకే ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహిస్తున్నారు - కాంగ్రెస్ అందుకు వ్యతిరేకంగా పోరాడుతోంది
- మోదీ ధనికులకు ఇచ్చిన డబ్బును.. పేదల ఖాతాల్లో వేస్తాం- మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ.లక్ష డిపాజిట్ చేస్తాం
- నర్సాపూర్ కాంగ్రెస్ జనజాతర సభలో రాహుల్ గాంధీ

మెదక్ (ప్రజా మంటలు): ఈ దేశంలో రాజ్యాంగంతోనే పేదలకు బలమైన శక్తి వచ్చిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. దేశంలో 90శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాధికారం దక్కటం లేదు. విద్య, ఉద్యోగాలు, ఓటు హక్కు అన్నీ మనకు రాజ్యాంగం ద్వారానే వచ్చాయి. దాంతో పాటు రిజర్వేషన్లు కూడా రద్దు చేయాలని భాజపా, ఆర్ఎస్ఎస్ కుట్ర చేస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్ జిల్లా నర్సాపూర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభలో ఆయన ప్రసంగించారు. గొప్ప మేధావులు ఏళ్ల తరబడి కృషి చేసి దేశానికి రాజ్యాంగం అందించారు. ఎంతో గొప్పదైన మన రాజ్యాంగాన్ని మారుస్తామని భాజపా నేతలు చెబుతున్నారని హెచ్చరించారు. రిజర్వేషన్లు రద్దు చేసే కుట్రలో భాగంగానే ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయిస్తున్నారు. క్రమంగా అన్నింటినీ ప్రైవేటు పరం చేసి రిజర్వేషన్లు రద్దు చేయాలనేది భాజపా ఆలోచన. మోదీ పదేళ్లలో విమానాశ్రయాలు, పోర్టులు, భారీ

మిగతా 2లో..

# దేశ సంపద అదానీ, అంబానీకి దోచిపెట్టారు



- పదేళ్లు అధికారంలో ఉండి తెలంగాణకు బీజేపీ ఏంచేసింది?
- ఒక్క హామీ నెరవేర్చకుండా రాముడి పేరుతో రాజకీయం చేస్తోంది
- రాష్ట్రానికి ఏమీ చేయని బీజేపీ,బీఆర్ఎస్‌లకు ఓటెందుకు వేయాలి : సిఎం రేవంత్

మెదక్ (ప్రజా మంటలు): బీజేపీ పదేళ్లు దేశంలో అధికారంలో ఉండి తెలంగాణకు ఏం చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధికి సహకరించని బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో ఎందుకు ఓట్లు వేయాలని నిలదీశారు. ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా రాముడి పేరుతో రాజకీయాలు చేస్తోందని అన్నారు. నర్సాపూర్‌లో గురువారం కాంగ్రెస్ జనజాతర సభ జరిగింది. ఈ సభలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. దుబ్బాక ప్రజలకు బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఏం చేయలేదని మండిపడ్డారు. ఆయన మీద నమ్మకంతో దుబ్బాక ఉప ఎన్నికల్లో గెలిపిస్తే ప్రజలను మోసం చేశారని అన్నారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు మెదక్ నుంచి పోటీ చేస్తున్నారని అన్నారు. దుబ్బాకలో ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకే రఘునందన్‌రావును మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓడించారని అన్నారు. ఈ ఎన్నికల్లో కూడా ఆయనకు ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ప్రజల భూములు లాక్కున్న వ్యక్తి వెంకట్రామిరెడ్డి బీఆర్ఎస్ తరపున ఎంపీగా పోటీలో ఉన్నారని చెప్పుకొచ్చారు. ÷ఔనిర్వాసితులను మోసం చేసిన వెంకట్రామిరెడ్డికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా బీజేపీకి రాముడు గుర్తుకొస్తాడని విమర్శించారు. దేవుడు గుడిలో ఉండాలి.. భక్తి గుండెల్లో ఉండాలని

మిగతా 2లో..



# 10సీట్లకు పైగానే గెలుస్తున్నాం

**తెలంగాణలోకాంగ్రెస్ పరిస్థితి దయనీయంగా ఉంది - రాహుల్ పిల్ల చేష్టలు..మోడీ గ్యారెంటీల మధ్య పోటీ**

**భువనగిరి సభలో అమిత్ షా విమర్శలు**

భువనగిరి,మే9 (ప్రజా మంటలు): రాహుల్ పిల్ల చేష్టల గ్యారంటీలు.. మోదీ గ్యారంటీల మధ్య జరుగుతున్న ఎన్నికలివని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. కాంగ్రెస్ పరిస్థితి దయనీయంగా తయారైందని, ఆ పార్టీ తరఫున పోటీ చేసేందుకు అభ్యర్థులు కూడా దొరకట్లేదని ఎద్దేవా చేశారు. మోదీ ఏం చెబుతారో దానిని తప్పకుండా చేస్తారని, రాహుల్ ఇచ్చిన గ్యారంటీలు అమలయ్యే పరిస్థితి లేదని అన్నారు. భువనగిరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ అమలు కాలేదు. వారికి ఏటా రూ.15 వేల ఆర్థిక సాయం ఇవ్వలేదు. వరి, గోధుమలకు రూ.500 బోనస్ అందించలేదు. కాంగ్రెస్ చేసిన వాగ్దానాలను ఎన్నటికీ నెరవేర్చదు. ఆ పార్టీ 70 ఏళ్లుగా అయోధ్య విషయాన్ని పక్కన పెట్టిందని విమర్శించారు. నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీ మధ్య జరుగుతున్న ఎన్నికలివి. కుటుంబ అభివృద్ధి - దేశవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధికి మధ్య ఎన్నికలు. మూడు విడతల్లో ఇప్పటికే 200 సీట్లకు పైగా స్థానాలు గెలుస్తాం. దేశవ్యాప్తంగా మొత్తం 400 లోక్‌సభ స్థానాలు సాధిస్తాం. తెలంగాణలో గత ఎన్నికల్లో 4 లోక్‌సభ సీట్లు గెలిచాం. ఈసారి 10కి పైగా గెలుస్తాం. రాష్ట్రంలో

మిగతా 2లో..

# పద్మవిభూషణుడు మన చిరంజీవి

**రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం**

**అట్టహాసంగా పద్మ పురస్కారాలు**

**చిరుకు పలువురు ప్రశంసలు**



న్యూఢిల్లీ,మే9(ఆర్ఎన్ఎ): మెగాస్టార్ చిరంజీవి దేశంలోని రెండో అత్యున్నత పురస్కారం పద్మ విభూషణ్ అందుకున్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అవార్డును చిరంజీవికి అందించారు. చిరంజీవితో పాటుగా పలువురు పద్మ అవార్డులు అందుకున్నారు.

మిగతా 2లో..

# ఎన్నికల ప్రచారం ప్రాథమిక హక్కు కాదు

**రాజ్యాంగం కల్పించిన హక్కు కూడా కానేకాదు - కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌పై ఇడి అఫిడవిట్**



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): మద్యం కుంభకోణంకు సంబంధించి.. మనీ ల్యాండరింగ్ కేసులో అరెస్ట్ అయిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్‌ను ఈడీ వ్యతిరేకించింది. ఆయన ఎన్నికల ప్రచారం చేసే హక్కు.. ప్రాథమికమైనది కాదని స్పష్టం చేసింది. అలాగే రాజ్యాంగం కల్పించిన హక్కు కాదు.. న్యాయపరమైన హక్కు కూడా కాదని ఈడీ పేర్కొంది. గురువారం సుప్రీంకోర్టులో అఫిడవిట్‌ను ఈడీ దాఖలు చేసింది.ఎన్నికల ప్రచారంలో పాల్గొనడానికి ఏ రాజకీయ నాయకుడికి మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన దాఖలాలు అయితే లేవని ఈడీ తన అఫిడవిట్‌లో పేర్కొంది. అదీకాక ఆయన ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థి కూడా కాదని వివరించింది. గతంలో అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సమన్లు తప్పించుకొనేందుకు అరవింద్ కేజ్రీవాల్... ఈ తరహా పద్ధతిని అనుసరించారని తన అఫిడవిట్‌లో ఈడీ గుర్తు చేసింది. ఎన్నికల ప్రచారం కోసం జ్యుడిషియల్ కస్టడీలో ఉన్న ఏ రాజకీయ నాయకుడు మధ్యంతర బెయిల్ ఇచ్చిన ఘటనలు అయితే లేవని తెలిపింది. గత మూడేళ్లలో చాలా ఎన్నికలు జరిగాయని.. అయితే అరెస్ట్ అయిన ఏ రాజకీయ నాయకుడికి మధ్యంతర బెయిల్ ఇవ్వలేదని అఫిడవిట్‌లో సోదాహరణగా వివరించింది. ఓ వేళ ఎన్నికల ప్రచారం కోసం కేజ్రీవాల్‌కు ప్రత్యేక రాయితీతో మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తే.. అది చట్టం పరిధి దాటినట్లు అవుతుందంది. అనైతిక రాజకీయ నాయకులు ఎన్నికల ముసుగులో దర్యాప్తు నుంచి తప్పించుకొనేందుకు మధ్యంతర బెయిల్ పేరిట ప్రయత్నిస్తారని తన అఫిడవిట్‌లో ఈడీ ఆరోపించింది. ఓ వేళ

మిగతా 2లో..



# ఇండియా కూటమి విజయం ఖాయం

**భయంతోనే మోడీ మాట్లాడుతున్నారు**

**శంకరమ్మ సహా పలువురు కాంగ్రెస్‌లో చేరిక**

**ఆమెకు తగిన ప్రాధాన్యం ఉంటుందన్న ఉత్తమ్**

హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణకు ప్రధాని మోదీ చేసిన అభివృద్ధి శూన్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. అదాని కాంగ్రెస్ మనిషి అన్నట్లు మోదీ మాట్లాడడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇండియా కూటమి కేంద్రంలో అధికారంలోకి వస్తుందన్న

మిగతా 2లో..

# యువత భవిష్యత్తుకు రాహుల్ ప్రధాని కావాలి

**- ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్**



(రామ కిష్టయ్య సంగన భట్ల)

ధర్మపురి మే 09 (ప్రజా మంటలు) : భారత దేశంలో యువత ఉజ్వల భవిష్యత్తు కోసం రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాల్సిన అవసరం అనివార్యంగా ఉందని, అందుకు పెద్దపెల్లి లోక సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణకు మద్దతుగా ఓటర్లు నిలవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ పెద్దపెల్లి ఎంపి అభ్యర్థి వంశీకృష్ణ.. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ లతో కలిసి గురువారం ధర్మపురి మండలం రాయపట్నం గ్రామం నుండి ధర్మపురికి చేరుకుని, పలు వార్డులో భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. రాయపట్నం నుండి ప్రారంభం అయిన ర్యాలీ కమలాపూర్ చౌరస్తా, గాంధీ చౌరస్తా, నంది చౌరస్తా, బోయవాడ, బ్రాహ్మణ సంఘం, తెనుగు వాడ మీదుగా పటేల్ గార్డెన్స్ వరకు కొనసాగగా, అనంతరం పటేల్ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ...దేశ భవిష్యత్తు,యువత భవిష్యత్తు తీర్చేదిద్దే విధంగా

మిగతా 2లో..

# ప్రజా నాడి




## బీజేపీ ఓట్లు అవసరమైనప్పుడల్లా
# మతవిద్వేషాలు రెచ్చగొడుతోంది

- ఐదేళ్లు ఎంపీగా ఉండి బండి సంజయ్ కరీంనగర్‌కు ఏంచేశాడు?
- పదేళ్ల బీజపీ పాలనలో మోదీ 150 మోసపు హామీలు నినాదాలు
- పెట్రోల్, డీజిల్ , నిత్యావసరాల ధరలు మరింతగా పెరిగాయి
- కరీంనగర్ ఎన్నికల ప్రచారంలో కేసీఆర్



కరీంనగర్ (ప్రజా మంటలు): బీజేపీ నేతలు ఓట్లు అవసరమైనప్పుడల్లా మతవిద్వేషాలు రెచ్చగొడుతున్నారని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కరీంనగర్ ఎంతో అభివృద్ధి చెందిందని, బండి సంజయ్ కరీంనగర్‌కు ఏమైనా నిధులు తెచ్చారా? అని ప్రశ్నించారు. పదేళ్ల బీజపీ పాలనలో మోదీ 150 హామీలు, నినాదాలు ఇచ్చారని కేసీఆర్ పేర్కొన్నారు. మోదీ చెప్పిన దాంట్లో ఒక్కటి కూడా నెరవేరలేదని ఆయన మండిపడ్డారు. మోదీ అచ్చే దిన్ అంటే, చచ్చే దిన్ వచ్చిందని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ కరీంనగర్‌లో రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ పార్టీలపై విమర్శలు గుప్పించారు.ఈ పదేళ్లలో పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయని కేసీఆర్ పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి నిత్యావసరాల ధరలు మరింతగా పెరిగాయని ఆయన తెలిపారు . బేటీ బచావో, బేటీ పడావో కోసం మోదీ ఏమైనా చేశారా? అని నిలదీశారు. మోదీ నల్లధనం తెచ్చి పేదల ఖాతాల్లో రూ.15 లక్షలు వేశారా? అని ప్రశ్నించారు. రూపాయి విలువ దారుణంగా రూ.84కు పడిపోయిందని, పాకిస్థాన్ పేరు చెప్పి సెంటిమెంట్ బ్లాక్‌మెయిల్ చేసి ఓట్లు వేయించుకున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిందని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ఇప్పటివరకు చేయలేదని మండిపడ్డారు. హామీల అమలులో పూర్తిగా విఫలమయ్యిందని దుయ్యబట్టారు.

# అమెరికాలో మరో భారత విద్యార్థి అదృశ్యం

**తెలంగాణకు చెందిన రూపేశ్ చంద్ర కోసం గాలింపు**

న్యూయార్క్,మే9 (ప్రజా మంటలు): అమెరికాలో మరో భారతీయ విద్యార్థి కనిపించకుండా పోయాడు. తెలంగాణకు చెందిన రూపేశ్ చంద్ర చింతకింది షికాగోలో అదృశ్యమయ్యాడు. గత వారం రోజులుగా అతని ఆచూకీ లేదని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. రూపేశ్ ప్రస్తుతం షికాగోలోని విస్కాన్సిన్‌లో ఉన్న కాంకార్డియా యూనివర్సిటీలో మాస్టర్స్ చదువుతున్నాడు. భారత్‌కు చెందిన రూపేశ్ మే 2వ తేదీ నుంచి కన్పించడంలేదని తెలిసి కాన్సులేట్ ఆందోళన చెందుతున్నది. అతడి ఆచూకీ కోసం పోలీసులు, ప్రవాస భారతీయులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. త్వరలోనే అతని జాడ తెలుస్తుందని ఆశిస్తున్నామని షికాగోలోని భారత రాయబార కార్యాలయం సోషల్ మీడియా వేదికగా తెలిపింది. కాగా, రూపేశ్ గురించి తెలిస్తే తమకు సమాచార అందించాలంటూ పోలీసులు స్థానికులను కోరారు. ఉన్నత విద్యకోసం వెళ్లిన తమ కుమారుడి జాడ తెలియకపోవడంతో అతని తల్లిదండ్రులు ఆందోళనకు గురవతున్నారు. రూపేశ్ ఆచూకీ కనుక్కోవాలంటూ భారత విదేశాంగ మంత్రిత్వ శాఖను, అమెరికా ఎంబసీని అభ్యర్థించారు. కాగా, ఈ ఏడాది ఆరంభం నుంచి అమెరికాలో వరుసగా ఇలాంటి ఘటనలు చోటు చేసకుంటున్న విషయం తెలిసిందే. దాడులు, కిడ్నాప్‌ల వంటి ఘటనల్లో ఇప్పటికే పలువురు భారతీయ, భారత సంతతి విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు.

మొదటి పేజీ తరువాయి

# మోదీ ధనికులకు ఇచ్చిన డబ్బును.. పేదల ఖాతాల్లో వేస్తాం: రాహుల్



పరిశ్రమలు విక్రయించారు. భాజపా కుట్రలను అడ్డుకునేందుకు ఇండియా కూటమి శాయశక్తులా పోరాడుతోంది. మోదీ పాలనలో కేవలం 2శాతం ఉన్న బిలియనీర్ల చేతిలోకి దేశ సంపద అంతా వెళ్తోంది. బలహీన వర్గాల్లో రాజకీయ చైతన్యం తెచ్చేందుకు మేం కృషి చేస్తున్నాం. దేశంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించేందుకు గొప్ప పథకాన్ని రూపొందించాం. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చాక.. నిరుపేదలందరితో ఒక జాబితా రూపొందిస్తాం. ప్రతి కుటుంబం నుంచి ఒక మహిళ పేరును ఎంపిక చేసుకుని వారి బ్యాంకు ఖాతాలో రూ.లక్ష డిపాజిట్ చేస్తాం. విద్య, వైద్యం తదితర కుటుంబ ఖర్చుల కోసం వారికి ప్రతి నెలా రూ.8,500 వారి ఖాతాలో జమ అవుతాయని రాహుల్ గాంధీ తెలిపారు. ఈ క్రమంలో పూర్తి ఆధిపత్యం సాధించి బీజేపీ పార్టీ నేతలు రాజ్యాంగాన్ని మార్చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. అట్టడుగు వర్గాలకు రక్షణ రాజ్యాంగమని తెలిపారు. రాజ్యాంగం రాయడం కంటే ముందు పేదలకు హక్కులు లేవని చెప్పారు. సామాన్యుల గొంతుక భారత రాజ్యాంగమని తెలిపారు. రాజ్యాంగాన్ని అంబేద్కర్ ఎంతో శ్రమించి రాశారని తెలిపారు. కాంగ్రెస్ లక్ష్యం ఒక్కటే రాజ్యాంగాన్ని రక్షించడమేనని చెప్పారు. ఖర్గే, రేవంత్, తాను రాజ్యాంగాన్ని కాపాడాటం కోసం శ్రేమిస్తున్నామని తెలిపారు. ఈ ఎన్నికలు రెండు సిద్దాంతాల మధ్య జరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. దేశంలో పెట్టుబడి దారు వ్యవస్థను పెంచి పోశిస్తున్నారని చెప్పారు. 2 శాతం ఉన్న ధనవంతుల చేతిలో దేశ సంపద మొత్తం ఉందన్నారు. దేశంలో 20 మంది బడా వ్యాపారుల కోసమే మోదీ పనిచేస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్లు మార్చడం కోసమే సర్కార్ ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహిస్తుందని అన్నారు. దేశంలో బీజేపీ రాజ్యాంగాన్ని ఎత్తేయాలని చూస్తుంటే తాము 50శాతం పరిమితి ఎత్తివేయాలని చూస్తున్నామని అన్నారు. ఏ శక్తి రాజ్యాంగాన్ని మార్చలేదని అన్నారు. కాంగ్రెస్ అధికారం లోకి వస్తే దేశంలో కులగణన చేస్తామని తెలిపారు. ఒక చారిత్రాత్మకమైన నిర్ణయానికి తాము ప్రయత్నిస్తున్నామని తెలిపారు. దేశంలోని నిరుపేదలు ఎంత మంది ఉన్నారో వారందరి పేరు మీద జాబితా తయారు చేయబడుతు ందని అన్నారు.ప్రతి కుటుంబం నుంచి ఓ మహిళను ఎంపిక చేసి ఆమెకు రూ. లక్ష డిపాజిట్ చేస్తామని తెలిపారు. దేశంలోని ప్రతి మహిళ అకౌంట్ లో రూ. 8500 జమ చేయబడతాయని తెలిపారు. చదవు కోసం ఇంటి ఖర్చుల కోసం ఈ డబ్బు ఉపయోగపడుతుందని అన్నారు. ఒక్కదెబ్బతో దేశంలోని పేదరికాన్ని తరిమేసిన వాళ్లమౌతామని తెలిపారు. మోదీ కోట్ల మంది ఉవకులను నిరుద్యోగులను చేశారని ఆరోపించారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి టీం ప్రజల కోసం పనిచేస్తుందని తెలిపారు. ఆరు గ్యారెంటీలు ఖచ్చితంగా అములు చేస్తామని చెప్పారు. పంద్రాగస్ట్ లోగా రైతు రుణమాఫీ చేస్తామని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించాలని కోరారు. 1980లో మెదక్ నుంచి ఇందిరాగాంధీ ఘన విజయం సాధించారని, ఆమె ఎంపీగా ఉన్నప్పుడే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. భెల్, ఇతర పరిశ్రమలు ఈ ప్రాంతానికి వచ్చాయన్నారు. గత 25 ఏళ్లుగా మెదక్ లోక్‌సభ స్థానం భారాస, భాజపా చేతిలో చిక్కి నలిగిపోయిందని వ్యాఖ్యానించారు. దుబ్బాక ప్రజలను మోసం చేసిన వ్యక్తే మళ్లీ మెదక్ భాజపా ఎంపీ అభ్యర్థిగా ఉన్నారని ఎద్దేవా చేశారు. కలెక్టర్‌గా ఉన్నప్పుడు ఈ ప్రాంత రైతులపై అక్రమ కేసులు పెట్టి హింసించిన భారాస ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని ఓడించి కేసీఆర్, హరీశ్‌రావుకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. నర్సాపూర్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , కాంగ్రెస్ ఇన్ చార్జి దీప దాస్ మున్సి, మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ తదితరులు పాల్గొన్నారు. జనజాతర బహిరంగ సభ వేదికగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై ఓ రేంజ్ లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. ప్రస్తుత ఎన్నికలు రెండు సమూహాల మధ్య జరుగుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఓ వర్గం రాజ్యాంగాన్ని రక్షించాలనుకుంటుంటే.. మరో సమూహం రాజ్యాంగం అవసరం లేదు, రద్దు చేస్తామని చెబుతోందని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్ సరూర్ నగర్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ జనజాతర సభలో రాహుల్ ప్రసంగించారు. విద్య, ఉద్యోగాలు, ఓటు హక్కు.. ఇలా అన్నీ రాజ్యాంగం ద్వారానే వచ్చాయని, అలాంటి రాజ్యాంగంతోపాటు రిజర్వేషన్లను కూడా రద్దు చేయాలని భాజపా కుట్ర చేస్తోందని ఆరోపించారు.” మహామహా మేధావులు ఏళ్ల తరబడి కృషి చేసి దేశానికి రాజ్యాంగం అందించారు. ఎంతో గొప్పదైన మన రాజ్యాంగాన్ని మారుస్తామని భాజపా నేతలు చెబుతున్నారు. అందుకే ప్రభుత్వరంగ సంస్థలను విక్రయిస్తున్నారు. మోదీ గత పదేళ్లుగా దేశ సంపదనంతా అంబానీ, అదానీల చేతిలో పెట్టారు. వారికి రూ.16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రతి రాష్ట్రంలో పేదల వివరాలు సేకరిస్తుంది. పేదల జాబితా తయారు చేసి, ప్రతి కుటుంబంలోని మహిళ ఖాతాలో రూ.లక్ష వేస్తాం.పదేళ్లలో మోదీ ధనికులకు రూ.లక్షల కోట్లు దోచి పెట్టారు. ధనికులకు ఇచ్చిన డబ్బును మేం పేద మహిళల ఖాతాల్లో వేస్తాం. కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతు రుణమాఫీ, మద్దతు ధర అనే రెండు ప్రధాన హామీలు ఉన్నాయి. పట్టభద్రులు, నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనతోపాటు నైపుణ్య శిక్షణ ఇస్తాం. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగులకు నెలకు రూ.8,500 శిక్షణ భృతి అందిస్తాం. ఉపాధి హామీ పథకంలో ఇచ్చే రోజువారీ కూలీని రూ.400కు పెంచుతాం” అని రాహుల్ హామీ ఇచ్చారు.

## బాణసంచా పరిశ్రమలో పేలుడు.. - ఎనిమిది మంది మృతి!

శివకాశి (ప్రజా మంటలు): తమిళనాడులోని శివకాశి సమీపంలో గురువారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బాణసంచా తయారీ కర్మాగారంలో పేలుడు జరగడంతో ఎనిమిది మంది మృత్యువాత పడగా.. 12 మందికి గాయాలైనట్లు సమాచారం. ఈ ఫ్యాక్టరీకి లైసెన్స్ ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పేలుడుకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మన దేశంలో బాణసంచా తయారీకేంద్రంగా శివకాశి ప్రసిద్ధిచెందిన విషయం తెలిసిందే.

## ఇతర దేశాలపై గౌరవం పట్ల మా నిబద్ధత మారదు - మాల్దీవుల మంత్రితో జైశంకర్

దిల్లీ (ప్రజా మంటలు): రెండు దేశాల మధ్య దౌత్యపరమైన వివాదం కొనసాగుతోన్న తరుణంలో మాల్దీవుల విదేశాంగ మంత్రి మూసా జమీర్ భారత్ పర్యటనకు వచ్చారు. ఈసందర్భంగా దిల్లీలో మన విదేశాంగ మంత్రి జై శంకర్‌తో భేటీ అయ్యారు. ఇరు దేశాల ప్రయోజనాలు, పరస్పర గౌరవం మీద రెండు దేశాల మధ్య సంబంధాలు ఆధారపడి ఉంటాయని స్పష్టంచేశారు. తాము నైబర్‌హుడ్ ఫస్ట్ పాలసీ (పొరుగు వారికి ప్రథమ ప్రాధాన్యం) విధానానికి కట్టుబడి ఉన్నామని, మాల్దీవులకు అవసరం ఉన్న ప్రతిసారీ ఆదుకున్నామని గుర్తుచేశారు. ఈ సమావేశంలో జైశంకర్ ఎక్కడా చైనా పేరు ప్రస్తావించలేదు. అలాగే ఈ భేటీ దృశ్యాలను తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. మాల్దీవుల ప్రస్తుత అధ్యక్షుడు ముయిజ్జు చైనాకు అనుకూల వైఖరి ప్రదర్శిస్తోన్న సంగతి తెలిసిందే. ఆయన పగ్గాలు చేపట్టిన తర్వాత ఆ దేశం నుంచి భారత్‌కు తొలి ఉన్నతస్థాయి అధికారిక పర్యటన ఇదే కావడం గమనార్హం. ఈక్రమంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. మాల్దీవుల నుంచి భారత బలగాలను వెనక్కి తీసుకోవాలని ముయిజ్జు కోరిన విషయం తెలిసిందే. అందుకు ఆయన మే 10 గడువుగా విధించారు. అది సమీపించిన తరుణంలో ఇరుదేశాల మధ్య సమావేశం జరుగుతుండడం గమనార్హం. అక్కడున్న సైనికుల్లో చాలామందిని భారత్ ఇప్పటికే వెనక్కి రప్పించింది. ప్రస్తుత భేటీలో ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతో పాటు ప్రాంతీయపరమైన అంశాలు చర్చకు వస్తాయని ఇదివరకే విదేశాంగ శాఖ ప్రకటించింది. “హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారతదేశానికి మాల్దీవులు కీలక భాగస్వామి. జమీర్ పర్యటన ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సహకారానికి మరింత ఊతమిస్తుందని భావిస్తున్నాం” అని విదేశాంగ శాఖ తన ప్రకటనలో పేర్కొంది.

## దేశ సంపద అదానీ, అంబానీకి దోచిపెట్టారు



ఉద్ఘాటించారు. పోలింగ్ బూత్‌లో ఓట్ల కోసం దేవుడి పేరును వాడుకోవద్దని హితవు పలికారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ అడిగితే.. మోదీ గాడిదగుడ్డు ఇచ్చారని ఎద్దేవా చేశారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ అడిగితే మోదీ గాడిదగుడ్డు ఇచ్చారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెటైర్లు గుప్పించారు.

## భారత్ ఎన్నికల్లో అమెరికా జోక్యం - రష్యా ఆరోపణలు

మాస్కో (ప్రజా మంటలు): ఖలిస్థానీ ఉగ్రవాది, నిషేధిత ‘సిఖ్స్ ఫర్ జస్టిస్’ నేత గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు తమ దేశంలో కుట్ర జరిగిందంటూ, దానివెనక భారత వ్యక్తుల ప్రమేయం ఉందంటూ అమెరికా ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలను తాజాగా రష్యా తోసిపుచ్చింది. వాటికి ఎలాంటి సాక్ష్యాలు చూపించలేదని తెలిపింది. ఇక, భారత సార్వత్రిక ఎన్నికల్లో జోక్యం చేసుకోవాలని అమెరికా ప్రయత్నిస్తోందని దుయ్యబట్టింది.”భారత్‌లో ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను క్లిష్టతరం చేయాలన్న ఉద్దేశంతో.. అక్కడి అంతర్గత రాజకీయ పరిస్థితులను అస్థిరపర్చాలని అగ్రరాజ్యం ప్రయత్నిస్తోంది. ఇది భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమే అవుతుంది” అని రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మారియా జఖరోవా మారియా వ్యాఖ్యానించారు. మత స్వేచ్ఛ విషయంలో భారత్ ఉల్లంఘనలకు పాల్పడుతోందని కొద్దిరోజుల క్రితం అంతర్జాతీయ మత స్వేచ్ఛపై అమెరికా కమిషన్ (యూఎస్‌సీఐఆర్ఎఫ్) నివేదిక ఇచ్చిన సంగతి తెలిసిందే. దీన్ని భారత్ తీవ్రంగా ఖండించింది.”ఇది మా దేశ ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవడమే. ‘యూఎస్‌సీఐఆర్ఎఫ్’ అనేది పక్షపాతంతో వ్యవహరించే సంస్థ. రాజకీయ ఎజెండాతోనే అది పని చేస్తుంది. భారత్‌లోని విభిన్న, బహుళార్థ, ప్రజాస్వామ్య విలువలు ఆ సంస్థకు అర్థం కావు. ప్రపంచంలోనే అతి పెద్ద ఎన్నికల ప్రక్రియలో ఇలా అమెరికా సంస్థ జోక్యం చేసుకోవడం ఆమోదయోగ్యం కాదు” అని న్యూదిల్లీ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే మీడియా అడిగిన ప్రశ్నకు మారియా పైవిధంగా స్పందించారు.ఈ సందర్భంగా పన్నూ హత్యకు కుట్ర కేసు గురించి మీడియా అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. “ఇప్పటివరకు మాకు అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. ఈ కేసుకు సంబంధించి వాషింగ్టన్ నమ్మదగిన సాక్ష్యాలను ఇంతవరకు అందించలేదు. తగిన ఆధారాలు లేనప్పుడు ఈ అంశంపై ఊహాగానాలు చేయడం ఆమోదయోగ్యం కాదు” అని మారియా బదులిచ్చారు.అమెరికాలోని సిఖ్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జె) సంస్థ ప్రతినిధి గురుపత్వంత్ సింగ్ ఖలిస్థానీల కీలక నేత. భారత ప్రభుత్వం అతడిని ఉగ్రవాదిగా ప్రకటించింది. అమెరికాలో ప్రాణాంతక ఆపరేషన్‌ను భారత గూఢచర్య సంస్థ నిర్వహించడంపై అగ్రరాజ్య అధికారులు విస్మయం వ్యక్తం చేశారని కొద్దిరోజుల క్రితం వాషింగ్టన్ పోస్ట్ కథనం పేర్కొంది. అయితే, అమెరికా నిఘా విభాగాలు పన్నూపై హత్యాయత్నాన్ని అడ్డుకున్నాయని తెలిపింది. అలాగే ఆ ‘రా’ అధికారి పేరు విక్రమ్ యాదవ్‌గా పేర్కొంది. భారత ప్రధాని మోదీకి అత్యంత సన్నిహితమైన అంతర్గత బృందానికి ఈ ప్లాన్ తెలుసునని వ్యాఖ్యానించింది. దీనిపై భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. “ఒక సున్నితమైన అంశంపై ఆ నివేదిక నిరాధారమైన, అనవసర ఆరోపణలు చేస్తోంది. దర్యాప్తు కొనసాగుతోన్న వేళ.. ఇలాంటి ఊహాజనితమైన, బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు ఏమాత్రం ప్రయోజనం చేకూర్చవు” అని మండిపడింది.

## రఫాపై ఇజ్రాయెల్ దాడుల ఆలోచన ఆందోళనకరం - ‘డబ్ల్యూహెచ్‌వో’



గాజా స్ట్రిప్ (ప్రజా మంటలు): దక్షిణ గాజాలోని రఫా నగరంపై ఇజ్రాయెల్ దాడి చేయడం ఖాయమన్న సంకేతాలు వెలువడుతున్నాయి. దాదాపు 13–14 లక్షల మంది పాలస్తీనియన్లు తలదాచుకుంటున్న ఈ ప్రాంతంపై దాడి చేస్తే భారీ మానవ సంక్షోభం తప్పదనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాలపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తంచేసింది. దక్షిణ గాజాలో వైద్య కార్యకలాపాల నిర్వహణ కోసం కేవలం మూడు రోజులకు సరిపడా మాత్రమే ఇంధన నిల్వలు ఉన్నట్లు తెలిపింది. ఇంధనం కొరత కారణంగా రఫాలో మిగిలి ఉన్న మూడు ఆస్పత్రుల్లో ఇప్పటికే ఒకటి మూత పడినట్లు చెప్పింది. మరోవైపు ఉత్తర గాజా పూర్తి కరవు స్థితిలో ఉందని ఐరాస పేర్కొంది. ఇజ్రాయెల్‌కు సరఫరా చేయాల్సిన ఆయుధాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అమెరికా ప్రకటించిన విషయం తెలిసిందే. అగ్రరాజ్యం అధ్యక్షుడు జో బైడెన్ తాజాగా ఇదే విషయాన్ని స్పష్టంచేశారు. “ఇజ్రాయెల్ ఆత్మరక్షణకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నాం. ఐరన్ డోమ్ రాకెట్ ఇంటర్‌సెప్టర్లు, ఇతర ఆయుధాలను సరఫరా చేస్తాం. అయితే.. రఫాపై దాడుల విషయంలో మాత్రం ఆయుధాలు, ఫిరంగి గుండ్లను సరఫరా చేయబోం’ అని ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బైడెన్ తెలిపారు. ఆయుధాల నిలిపివేత వ్యవహారంపై ఇజ్రాయెల్ జాతీయ భద్రత వ్యవహారాల శాఖ మంత్రి ఇటామర్ బెన్ గ్విర్ స్పందిస్తూ.. ‘బైడెన్ అంటే హమాస్‌కు ప్రేమ’ అని వ్యంగ్యంగా ట్వీట్ చేశారు.

# 10సీట్లకు పైగానే గెలుస్తున్నాం

డబుల్ డిజిట్ స్కోర్‌తో దేశంలో 400 సీట్లకు మార్గం సుగమం అవుతుంది. అబద్ధాలతో ఎన్నికల్లో గెలవడానికి కాంగ్రెస్ యత్నిస్తోందని అన్నారు. మోదీ మళ్లీ వస్తే రిజర్వేషన్లు తొలగిస్తారని అవాస్తవాలు చెబుతున్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ల ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు నష్టం వాటిల్లుతుంది. వాటిని రద్దు చేసి మరింత పటిష్ఠంగా ఉన్న రిజర్వేషన్లను అమలు చేస్తామని అన్నారు. కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే. భువనగిరి టెక్స్‌టైల్ పరిశ్రమల కోసం మోదీ కృషి చేశారు. రూ.1500 కోట్లతో జాతీయ టెక్స్‌టైల్ విధానం అమల్లోకి తెచ్చాం. భువనగిరి నుంచి భూపాలపల్లి వరకు జాతీయ రహదారి నిర్మించాం. బీబీ నగర్ ఎయిమ్స్ నిర్మించి పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాం. జనగామ నుంచి భువనగిరి వరకు రైల్వే లైన్ల ఆధునికీకరణ చేపట్టాం. కొమురవెల్లిలో అత్యాధునిక రైల్వే స్టేషన్ నిర్మిస్తున్నాం. భారాస ప్రభుత్వ హయాంలో కుటుంబం మాత్రమే బాగుపడింది. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను ఏటీఎంగా వాడుకుంటోంది అని అమిత్‌షా విమర్శించారు. ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## యువత భవిష్యత్తుకు రాహుల్ ప్రధాని కావాలి

రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాల్సిన అవసరం ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం లో పెట్రోల్, గ్యాస్, ఎరువుల ధరలు ఏ విధంగా ఉండేవి, మోడీ ప్రభుత్వంలో ఏ విధంగా ఉన్నాయో ఒకసారి గమనించాలన్నారు. బీజేపీ ప్రభుత్వం జై శ్రీ రామ్ అనే పేరుతో ఓట్లు అడిగే పరిస్థితి ఉందని, నరేంద్ర మోడి ప్రధానిగా 10 సంవత్సరాలు ఉండి, పెద్దపెల్లి కి ధర్మపురి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమి లేదన్నారు. ధర్మపురిలో ఒక ఇండస్ట్రీనీ ఏర్పాటు చేయాలని మంత్రి శ్రీధర్ బాబును కలిసి విన్నవిస్తామని, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా పని చేసి పెద్దపెల్లి ఎంపి గా వంశీ గారిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు. గత కొన్ని రోజులుగా బి.అర్.ఎస్ నాయకులు తనకు ఫోన్ కాల్స్ ద్వారా కాంగ్రెస్ పార్టీలో చేరతామని కురుతున్నారని, కష్ట కాలంలో పని చేసిన ప్రతి కార్యకర్తకు అండగా తాము ఉంటామని, తాను, వంశీ రెండు కళ్ళలాగ కార్యకర్తలను కాపడుకుంటామన్నారు. పెద్ద ఎత్తున యువత వెయ్యి నుండి పదిహేను వందల బైక్ లతో పెద్ధపెల్లి ఎంపి అభ్యర్థి వంశీకి, ఎమ్మెల్యే వివేక్ కు స్వాగతం పలికినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నమని లక్ష్మణ్ కుమార్ అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఇండియా కూటమి విజయం ఖాయం

సమాచారంతోనే మోదీ భయంతో మాట్లాడుతున్నారన్నారు. కేసీఆర్ 10 ఏళ్ళు సీఎంగా ఉండి రాష్ట్రాన్ని నాశనం చేశారని విరుచుకుపడ్డారు. తడిసిన ధాన్యాన్ని ఎమ్మెస్పీ ధరకు ప్రభుత్వమే కొంటుందని స్పష్టం చేశారు. ఎన్నికలు పూర్తవగానే కొత్త రేషన్ కార్డులు ఇస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో వేలాది మంది కాంగ్రెస్‌లో చేరుతున్నారని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. భాజపా, భారస ..తెలంగాణ ప్రజలను మోసం చేసి గెలవాలని చూస్తున్నాయని విమర్శించారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ల విషయంలో జనాలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.తెలంగాణ ప్రజలకు భాజపా ఏమీ చేయలేదు. దేశంలో ఇండియా కూటమి అధికారంలోకి రాబోతోంది. దానిని జీర్ణించుకోలేకే భాజపా ఏదేదో మాట్లాడుతోంది. పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారు. ఈ ఎన్నికల్లో మేం అద్భుత విజయం సాధించడం ఖాయం. మా పార్టీకి అత్యధిక మెజార్టీ వస్తుందని అనేక సర్వేలు చెబుతున్నాయని ఉత్తమ్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ అమరుడు శ్రీకాంత చారి తల్లి శంకరమ్మ కాంగ్రెస్ పార్టీలో చేరారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శంకరమ్మకు పార్టీలో తగిన ప్రాధాన్యత ఇస్తామన్నారు. శంకరమ్మ కుటుంబం చేసిన త్యాగం కాంగ్రెస్ పార్టీ మరవదని మంత్రి తెలిపారు. గురువారం శ్రీకాంత చారి తల్లి శంకరమ్మ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గాంధీభవన్‌లో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. నల్గొండ జిల్లాకు చెందిన వందలాది మంది బీఆర్ఎస్ ముఖ్య నేతలు పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ఉత్సాహంగా ఉన్న నేతలను పార్టీలో చేర్చుకోవాలని ఏఐసీసీ నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని తెలిపారు.హుజుర్‌నగర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీలోకి పెద్ద ఎత్తున చేరికలు జరిగాయన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అబద్దాలు ప్రచారం చేసుకుని గెలవాలని ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. మోదీ దిగజారి మాట్లాడుతున్నారన్నారు.

## పద్మవిభూషణుడు మన చిరంజీవి

కళారంగానికి అందించిన సేవలకు గుర్తింపుగా చిరంజీవికి పద్మ విభూషణ్ పురస్కారం లభించింది. ఈ కార్యక్రమంలో చిరంజీవి సతీమణి సురేఖ, కుమారుడు రామ్ చరణ్, కోడలు ఉపాసన పాల్గొన్నారు. ఈ ఏడాది కేంద్రం ఐదుగురికి పద్మ విభూషణ్, 17 మందికి పద్మ భూషణ్, 110 మందికి పద్మ శ్రీ పురస్కారాలు ప్రకటించింది. 1978లో సినీ కెరీర్ ప్రారంభించిన చిరంజీవి స్వయం కృషితో అలుపెరగకుండా సినిమాలు చేస్తూ..ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు. సినిమాలే కాకుండా సామాజికంగా ఎన్నో సేవలు చేశారు. గతంలో కేంద్ర ప్రభుత్వం చిరంజీవిని పద్మభూషణ్ అవార్డుతో సత్కరించిన సంగతి తెలిసిందే. ఇక చిరు సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం ఆయన విశ్వంభర మూవీతో ప్రేక్షకులను పలకరించనున్నారు. బింబిసార ఫేమ్ వశిష్ట ఈ చిత్ర దర్శకుడు. సోషియో ఫాంటసీ నేపథ్యంలో తెరకెక్కుతుంది. చిరంజీవికి జోడీగా త్రిష నటిస్తుంది. ఈషా చావ్లా, సురభి వంటి యంగ్ హీరోయిన్స్ సైతం జాయిన్ అయ్యారు. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమాను రిలీజ్ చేయనున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా.. 2024 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం 132 మందికి పద్మ అవార్డులను ప్రకటించిన విషయం తెలిసిందే! వారిలో 67 మందికి ఏప్రిల్ 22వ తేదీన పద్మ అవార్డుల్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేయగా.. మిగిలిన 65 మందికి గురువారం సాయంత్రం ప్రదానం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ నటుడు చిరంజీవి పద్మ విభూషణ్ పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉపరాష్ట్రపతి, పలువు కేంద్రమంత్రులతో పాటు అధికారులు హాజరయ్యారు. వివిధ రంగాల్లో విశేష కృషి సేవలందించిన వారిని పద్మ భూషణ్, పద్మ విభూషణ్, పద్మశ్రీ పురస్కారాలను అందించారు. అసాధారణమైన విశిష్ట సేవకు పద్మవిభూషణ్, ఉన్నత స్థాయి విశిష్ట సేవలకు పద్మభూషణ్, విశిష్ట సేవలకు పద్మశ్రీ పురస్కారాలు ఇవ్వడం జరుగుతుంది. ఈ అవార్డు గ్రహీతల్లో 30 మంది మహిళలు ఉండటం విశేషం. మెగాస్టార్ చిరంజీవి పద్మవిభూషణ్ అవార్డు అందుకోవడంతో పలువురు శుభాకాంక్షలు తెలిపారు. అక్కినేని నాగేశ్వర్‌రావు తర్వాత టాలీవుడ్‌లో ఈ అవార్డు అందుకోనున్న రెండవ నటుడు చిరంజీవి కావడం విశేషం. ఈ స్పెషల్ ఈవెంట్ మెగా అభిమానులందరికీ ప్రత్యేకమని చెప్పవచ్చు. ఈ సందర్భంగా అనేక మంది సినీ ప్రముఖులతోపాటు పలువురు అభిమానులు కూడా సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

## ఎన్నికల ప్రచారం ప్రాథమిక హక్కు కాదు

### రాజ్యాంగం కల్పించిన హక్కు కూడా కానేకాదు - కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌పై ఇడి అఫిడవిట్

జ్యుడిషియల్ కస్టడీలో ఉన్న వ్యక్తులు ఎన్నికల బరిలో నిలిచినా.. వారికి మధ్యంతర బెయిల్ ఇవ్వలేదని ఈడీ తన అఫిడవిట్‌లో గుర్తు చేసింది. సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తనకు బెయిల్ మంజూరు చేయాలని సుప్రీంకోర్టులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ క్రమంలో ఈడీ, కేజ్రీవాల్ తరఫు న్యాయవాదుల వాదనలను జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మసనం విని.. తీర్పును శుక్రవారానికి రిజర్వ్ చేసింది.ఆ క్రమంలో అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇవ్వవద్దంటూ.. సుప్రీంకోర్టులో ఈడీ అఫిడవిట్ దాఖలు చేసింది. ఓ వేళ.. అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తే.. అధికారిక విధుల్లో పాల్గొనడం కానీ.. ÷ఫైళ్లపై సంతకాలు కానీ చేయకూడదంటూ సుప్రీంకోర్టు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

## మా మేనిఫెస్టోపై భాజపా అసత్య ప్రచారాలు - ప్రియాంకాగాంధీ

రాయ్‌బరేలీ (ప్రజా మంటలు): తమ పార్టీ మేనిఫెస్టోపై భాజపా అసత్య ప్రచారాలు చేస్తోందని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంకా గాంధీ ఆరోపించారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి కూడా పదవీ గౌరవాన్ని మరిచిపోయి మాట్లాడుతున్నారని అన్నారు.ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తున్న రాహుల్‌కు మద్దతుగా అక్కడ ప్రచారం నిర్వహించిన ప్రియాంక.. వాస్తవ సమస్యల నుంచి ప్రజల దృష్టి మరలించేందుకు భాజపా (ఃఏఖ) నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు.’ఎన్నికల సమయంలో పెట్టే టీవీ చర్చల్లో పాల్గొనే భాజపా నేతలు వాస్తవ సమస్యలను పక్కనపెట్టి మతపరమైన అంశాలను లేవనెత్తుతారు. మీ సంపదను కాంగ్రెస్ లాక్కుంటుందని చెబుతారు. ఎక్స్–రే మిషిన్లను తీసుకువచ్చి తనిఖీలు చేస్తారని, మీ నగదును తీసుకుపోతారని ప్రచారం చేస్తున్నారు. అత్యున్నత పదవిలో ఉన్న ప్రధాని మోదీ కూడా అదేవిధంగా వ్యవహరిస్తున్నారు. మనసుకి ఏది తోస్తే అది మాట్లాడుతున్నారు. అసలు ప్రశ్నలు లేవనెత్తనీయరు. ఎందుకంటే, గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం చేసింది ఏమీ లేదు’ అని ప్రియాంకాగాంధీ ఆరోపించారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, నల్లధనం వెనక్కి తెస్తామని, అందులోనుంచి ప్రజల ఖాతాల్లో రూ.15 లక్షల చొప్పున వేస్తామని చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు.పేద ప్రజల కోసం ఏ ఒక్క పథకమూ లేదని.. అన్ని విధానాలు బిలియనీర్ల కోసమే కేంద్రప్రభుత్వం రూపొందిస్తోందని ప్రియాంకాగాంధీ ఆరోపించారు. విపక్షాల కూటమి ‘ఇండియా’ అధికారంలోకి వస్తే రైతు రుణాల మాఫీ కోసం ఓ కమిషన్‌ను ఏర్పాటుచేస్తామన్నారు. అంతేకాకుండా వ్యవసాయ ఉత్పత్తులను జీఎస్టీ నుంచి మినహాయిస్తామని అన్నారు.

# మయూరం ప్రతిభ

సుందరవనం అనే అడవిలో ఒక నెమలి ఉండేది. దాని పేరు శిఖి. అది చాలా అద్భుతంగా నాట్యం చేసేది. దాని నాట్యానికి పక్షులతో పాటు మృగరాజు సింహం, జంతువులు అన్నీ ఆనందపడేవి.

ఇలా ఉండగా ఒకసారి ప్రక్క అడవిలో నాట్య పోటీలను ఆ అడవికి రాజు అయిన పెద్దపులి ఏర్పాటు చేసింది .దానిలో పాల్గొనాలని మృగరాజు సింహం ఈ శిఖిని ఆదేశించింది. అందుకు శిఖి సరేనంది. ఆ నాట్య పోటీలలో పాల్గొనడానికి వివిధ అడవుల నుండి అనేక పక్షులు ,జంతువులు వస్తున్నట్లు మృగరాజుకు సమాచారం అందింది.

ఆ పోటీ రోజు రానే వచ్చింది .మృగరాజు తన అడవిలోని జంతువులను, పక్షులను పిలిచి ఆ అడవిలోని పోటీలను చూడటానికి వెళ్ళమని చెప్పింది. ఈ శిఖి మన అడవి తరఫున పోటీలో పాల్గొంటున్నదని ,దానిని మీరంతా ప్రోత్సాహించాలని సింహం కోరింది .అందుకు పక్షులు, జంతువులు అన్నీ సరేనన్నాయి. శిఖి తాను తర్వాత వస్తానని, ఆ జంతువులను వెళ్ళమని కోరింది. అవి అన్ని ప్రక్క అడవికి బయలుదేరాయి .

అక్కడ పోటీ ప్రారంభమైంది. కానీ తమ అడవి శిఖి రానేలేదు .జంతువులు ,పక్షులు ఆందోళనతో దాని కొరకు చూశాయి. కానీ అది రానేలేదు. అప్పుడే అక్కడికి వచ్చిన వారి అడవిలోని మయూరం అనే చిన్న నెమలి ఒకటి ఆ పక్షులతో, జంతువులతో తాను శిఖి తరఫున పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పింది. అవి అన్నీ దాన్ని వద్దని చెప్పాయి. కానీ మయూరం వాటి మాటను లెక్క చేయలేదు. అది వెళ్లి పోటీలో తమ శిఖి బదులుగా తాను పాల్గొంటున్నట్లు అక్కడి వాటికి చెప్పింది .అవి సరేనన్నాయి. ఆ పోటీలలో మయూరం అద్భుతమైన నాట్యం చేసింది.




**కథల రచయితలకు ఆహ్వానం**

గత రెండున్నర సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను నెట్ బ్రౌజర్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.
mantalukathalu@gmail.com

దాని నాట్యానికి ఇతర అడవుల పక్షులు, జంతువులే కాకుండా ఈ సుందరవనం అడవి పక్షులు, జంతువులు కూడా చాలా ఆశ్చర్యపోయాయి.

చివరికి ఫలితాలను ప్రకటించారు. ఆ ఫలితాల్లో మయూరాన్ని విజేతగా వివిధ అడవుల నుండి వచ్చిన న్యాయ నిర్ణేతలైన నెమళ్లు ప్రకటించాయి. ఆ సభ అంతా కరతాళ ధ్వనులతో మారు మ్రోగింది . ఆ పక్షులు, జంతువులు అన్నీ సుందరవనం అడవికి సంతోషంతో తిరిగి వచ్చి మృగరాజుకు మయూరం అనే చిన్న నెమలి గెలిచినట్లు చెప్పాయి. మృగరాజుకు ఒక వైపు మయూరం గెలిచినందున సంతోషం, మరొకవైపు ఈ శిఖి తన ఆజ్ఞ ధిక్కరించినందుకు కోపం కలిగాయి. అది " ఈ శిఖి ఎక్కడికి వెళ్లింది? నాతోని పోటీలో పాల్గొనటం లేదని నాకు ఎందుకు చెప్పలేదు? నా ఆజ్ఞను ధిక్కరిస్తుందా!వెంటనే వెళ్లి దానిని నా వద్దకు తీసుకొని రండి "అని అంది.

అప్పుడు అక్కడే ఉన్న మయూరం "మృగరాజా! మీరు శిఖిని నిందించకండి. అది నా గురువు. నేను ఇలా గెలవడానికి కారణం మా గురువుగారే! అది నాకు ఈ నాట్యాన్ని నేర్పకుండా ఉంటే మనం గెలిచే వారమే కాము. నేను చాలా రోజుల నుండి మా గురువుగారి దగ్గర ఈ నాట్యాన్ని నేర్చుకుంటున్నాను. మీ ఆజ్ఞను అతిక్రమించింది అదికాదు. నేను. నన్ను శిక్షించండి. నా గురువు ఈ పోటీలకు వెళతానని అంటే కొంత దూరం వెళ్లిన పిదప దానిని నేనే వద్దని ఆపాను. ఎందుకంటే దానికి చాలా అస్వస్థతగా ఉంది. అది కాలు కదపలేని పరిస్థితిలో ఉంది .అలాంటప్పుడు అది నాట్యం ఎలా చేస్తుంది? అందుకే దానికి బదులుగా నేను వెళ్తానని దాని అనుమతిని కోరాను. అది తప్పనిసరి పరిస్థితుల్లో ఆపద్ధర్మంగా నన్ను వెళ్ళమంది !" అని అంది .

అప్పుడే అక్కడికి వచ్చిన శిఖి ఈ మాటలను విని " మృగరాజా! నన్ను క్షమించండి .నేను అక్కడికి నా శిష్యురాలైన మయూరంతో బయలుదేరి అస్వస్థత వల్ల మధ్యలోనే ఆగిపోయాను. అందుకే మన పరువు నిలుపుటకై మీకు ఇచ్చిన మాటకు కట్టుబడి నా శిష్యురాలైన ఈ మయూరాన్ని వెంటనే వెళ్లమన్నాను. కొన్ని రోజుల క్రిందట మా నెమళ్లను నాట్యం నేర్చుకోమని నేను ఎంత బ్రతిమాలినా అవి ఆసక్తిని చూపలేదు. ఈ మయూరం మాత్రం నాట్యం పట్ల తన ఆసక్తిని కనబరిచింది. ఒక్క నా పైననే మీరు ఆధారపడకూడదు. అందరూ ఈ నాట్యకళను నేర్చుకోవాలి. ఈ కళ నాతోనే అంతం కాకూడదనే సదుద్దేశంతో నేను దీనికి నాకు తెలిసిన నాట్య రీతులన్నీ నేర్పాను . ఇది నాకన్నా గొప్పగా నాట్యం చేయడం చూసే ఆపద్ధర్మంగా నేను ఆ పోటీలకు దీన్ని వెళ్ళమన్నాను. గురువు లేనిదే ఎవ్వరూ విద్యను నేర్చుకోలేరు. గురువు లేని విద్య గుడ్డి విద్య అని అంటారు. ఈ మయూరంలాంటి వాళ్లు చాలామంది తయారు కావాలి. లేకపోతే ఈ కళలు నాలాంటి వారితోనే అంతమవుతాయి. ఈ కళలు మన సంస్కృతికి ప్రతీకలు. ప్రతి గురువుకు తన కన్నా గొప్పగా శిష్యులను తయారు చేయాలని ఉంటుంది .మనం ఉన్నా లేకపోయినా ఈ కళ నిరంతరంగా కొనసాగుతూనే ఉంటుంది. ఇది చిన్న నెమలి అయినప్పటికీ చాలా వినయ విధేయతలు కలది. ఇది తప్పక గెలుస్తుందని నేను విశ్వసించాను. నా



నమ్మకాన్ని ఇది నిలబెట్టింది. నేను చేసింది తప్పైతే నన్ను శిక్షించండి "అని అంది .అప్పుడే అక్కడకు వచ్చిన మిగతా నెమళ్లన్నీ ఇదంతా విని తాము ఇకనుండి నాట్యం నేర్చుకుంటామని అన్నాయి. శిఖి ఎంతో సంతోషించింది.

అప్పుడు మృగరాజు " ఓ శిఖీ! నీవు మా అడవి పరువును కాపాడావు. ఈ మయూరాన్ని నీ అంత గొప్పదానిగా తయారు చేశావు .నేను కోపంతో అన్న మాటలను నీవు పట్టించుకోవద్దు. నీవు చేసింది చాలా మంచి పని" అని అంది .సింహం మాటలకు అన్నీ జంతువులు, పక్షులు కరతాళధ్వనులు చేసి సింహం ఆజ్ఞచే అవి మయూరాన్ని, శిఖిని గొప్పగా సత్కరించాయి. అప్పుడు పక్షులు, జంతువులు అన్నీ 'మయూరాన్ని, శిఖిని ఎంతగానో అభినందించాయి.

**సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,**
**ధర్మపురి. 9908554535**

# తాయిలాల వీరులు!

బాపురే!
ఇంకా ఎంతని ఇస్తారు?
పొంగిపొర్లుతున్న
మీ హామీల వరద ధాటి
భరించడం మా వల్ల కావట్లేదు.
ఉచితాలకు నడకలు నేర్పే
నవరసనటనాసార్వభౌములైనజి
మీ నటన చూడలేకున్నాము.
కూర్చొంటే తాయిలం,
నుంచుంటే తాయిలమిచ్చి
ప్రజల్ని సోమరిపోతులుగా
మార్చేస్తోన్న ఓ నాయకుల్లారా!
ఇలా చూడండి,
నా మాట వినండి.
మా పుట్టి ముంచబోయే
మీ ఉచితాల హామీల వర్షంలో
తడిసి ముద్దై,
అలసి సొలసిన నేను
కనురెప్పలు కుట్టేసుకుని నిద్రిస్తోంటే
నా కంటి పాప ఒక కమ్మని కల కంది.
అది మీకు చెప్పమంది.

ఒక పని చేయ రాదూ!
ఇన్ని వాగ్దానాల గోల లేకుండా
ముప్పొద్దులా మా ఇళ్ళకే
వండిన ఆహారం పంపి,
మా నోట్లో మీరే పెట్టే,
మా మూతులు మీరే కడిగే
పథకాన్ని అమలుచేస్తే,
గుర్తింపులేని చాకిరీ,
జీతం లేని నౌకరీతో
వంటింటి యుద్ధంలో
సైనికులుగా మారిన,
మా ఆడోళ్ల ప్రాణం
రెక్కలు తొడుక్కుంటుంది,
వాళ్లకు కొత్త జవసత్వాలొస్తాయి.

ఓ నేతల్లారా!
మీ గెలుపు కోసం
మా బతుకులు తాకట్టు పెట్టొద్దు.
రాష్ట్రాన్ని, దేశాన్ని
మరో పాకిస్తాన్,శ్రీలంకల్లా మార్చొద్దు.

**వేమూరి శ్రీనివాస్**
**9912128967**
**తాడేపల్లిగూడెం**

# మోడీని వెన్నాడుతున్న కాంగ్రెస్ భయం !

ప్రధాని మోడీ ప్రచారం ఇప్పుడంతా కాంగ్రెస్‌ను విమర్శించడానికే సరిపోయింది. కేవలం కాంగ్రెస్ బూచిని చూపి బిజెపికి ఓటేయాలని ఆయన ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రచారంలో స్పష్టం చేశారు. మరోవైపు ప్రధాని మోడీలో ఎక్కడో ఒకచోట కాంగ్రెస భయం వెన్నాడుతున్నట్లుగా కనిపించింది. ఆయన ప్రచారంలో గాంభీర్యత, ఆత్మవిశ్వాసం కానరావడంలేదు. పదేళ్లుగా దేశాన్ని గాడిన పెట్టినట్లు పలు సందర్భాల్లో ప్రకటించారు. 20కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేసినట్లుగా చెప్పుకున్నారు. రక్షణ రంగంలో స్వావలంబన సాధించామని చెప్పుకున్నారు. దేశం ఐదో ఆర్థిక శక్తిగా ఎదిగిందన్నారు. ప్రపంచ దేశాల్లో భారత్ తలెత్తుకునేలా చేశామని అన్నారు. ఇలా అనేక విషయాలు చెబుతూనే కాంగ్రెస్ వస్తే..అంటూ పేలవ ప్రసంగాలు చేస్తున్నారు. ఇన్ని చేసినా ప్రజలు మోడీని నమ్మడం లేదా అన్న అనుమానాలు కలుగు తున్నాయి. అందుకే ఆయన విపక్షాలను, కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం ద్వారా ప్రచారం కొనసాగించారు. కాంగ్రెస్ వస్తే జరిగే అనర్థాలను ప్రకటించారే తప్ప..తన పదేళ్ల పాలనా కాలంలో గట్టిగా ఇలా సాధించామని చెప్పలేకపోయారు. దీనిని బట్టి మోడీలో ఆత్మవిశ్వాసం దెబ్బతిన్నదా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ప్రసంగం కూడా చప్పగా సాగింది. ప్రజల్లో ఉత్తేజం కలగడం లేదు. ఇప్పటికే మూడుదశల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. నాలుగోదశ మే 13న జరుగనుంది. అందులో ఉభయ తెలుగు రాష్ట్రాలు ఉన్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లో బిజెపికి చెప్పుకోదగ్గ బలం లేదు. గత పదేళ్లలో ఈ రాష్ట్రాలకు పెద్దగా ఒరిగిందేమీ లేదు. ఈ క్రమంలో దేశ సార్వత్రిక ఎన్నికల సమరంలో గెలిచేదెవరన్న ప్రశ్న ఉదయిస్తోంది. గతంలో 2004లో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ఎన్నికల ముందు భారత్ వెలిగిపోతోందన్న నినాదం ఎత్తుకుంది. ఎన్నికల తరవాత కాంగ్రెస్ వెలిగింది. పదేళ్లు అధికారంలో కొనసాగింది. ఇప్పుడు పదేళ్లు మోడీ అధికారంలో ఉన్నారు. కేవలం మోడీ నేతృత్వంలోని బిజెపి మాత్రమే అధికారంలో ఉంది. పదేళ్లుగా మోడీ ఎంత చెబితే అంత. ఏది నిర్ణయిస్తే అదే శాసనం. ఏ నిర్ణయాల్లోనూ చర్చలు లేవు. పార్లమెంటులో అయితే అస్సలు చర్చ లేదు. ఈ క్రమంలో మోడీ ముందే కాంగ్రెస్‌కు అధికారం వస్తుందని వాసన పసిగట్టారా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఆయన చేస్తున్న ప్రసంగాల తీరు దీనిని బలపరుస్తోంది. అందుకే కేంద్రంలో అధికారం చేపట్టేదెవరు.. అన్న చర్చ సాగుతోంది. మళ్లీ మోడీ వస్తాడన్న ధీమా ప్రజల్లో కూడా కానరావడం లేదు. ఇప్పటికే మూడు విడతల్లో సగానికి పైగా లోక్‌సభ స్థానాల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. మొదటి మూడు విడతల్లో ఎవరిది అధిపత్యం అనేదానిపైనా ఇప్పుడు తీవ్ర చర్చ జరుగుతోంది. మొదటి మూడు విడతల్లో పోలింగ్ తక్కువ నమోదైంది. బీజేపీకి ఈ మూడు విడతల్లో ఎదురుదెబ్బ తగిలిందని ఇండియా కూటమి బలంగా విశ్వసిస్తోంది. ఎన్డీయే బలం గతంకంటే పెరిగింది.. ఇండియా కూటమికి గతంలో వచ్చిన సీట్లు రావంటూ బీజేపీ చెప్పుకుంటోంది. ఈ క్రమంలో మొదటి మూడు విడతల్లో ఎవరిది అధిపత్యం అనే విషయంలో భిన్నమైన అభిప్రాయాలను రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఇండియా కూటమి అధికారంలోకి రావాలంటే ఈ మూడు విడతల్లో జరిగిన ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలుచుకోగలిగితేనే కేంద్రంలో అధికారంలోకి వచ్చే అవకాశం ఉంటుందని, రానున్న నాలుగు విడతల ఎన్నికల్లో ఒక్క తెలంగాణ మినహా మిగతా చోట్ల ఇండియా కూటమికి ఎక్కువ మొత్తంలో సీట్లు గెలిచే అవకాశం లేనట్లు తెలుస్తోంది.

మొదటి మూడు విడతల్లోనే కర్ణాటక, తమిళనాడు, కేరళలోని అన్ని స్థానాల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. ఈ మూడు రాష్ట్రాల్లో కలిపి 87 స్థానాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో తమిళనాడు, కేరళలో ఇండియా కూటమి పక్షాలు ఎక్కువ సీట్లు గెలవగా.. ఎన్డీయే కూటమి కర్ణాటకలో మాత్రమే ప్రభావం చూపించింది. ప్రస్తుతం కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటంతో ఈ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు జరిగినట్లు తెలుస్తోంది. కర్ణాటక, తమిళనాడు, కేరళ లోని మొత్తం స్థానాలతో పాటు మహారాష్ట్రలో 48 స్థానాలకు గానూ 24 స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. 112 స్థానాల్లో ఇండియా కూటమి కనీసం వంద స్థానాలకుపైగా గెలుచుకో గలుగుతుందని అంచనా వేస్తున్నారు. కేరళ, తమిళనాడులో కలిపి 59 స్థానాల్లో క్లీన్ స్వీప్ చేసే అవకాశం ఉందని హస్తం పార్టీ అంచనా వేస్తోంది. మూడు విడతల్లో కలిపి దాదాపు 150 సీట్లు సాధిస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అదే జరిగితే ఇండియా కూటమి మరో నాలుగు విడతల్లో జరగనున్న 260 స్థానాల్లో 100 నుంచి 120 స్థానాలు గెలుచుకుంటే అధికారంలోకి రావొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో ప్రధాని మరో నాలుగు విడతల్లో ఎక్కువ సీట్లు సంపాదించాలని భావిస్తున్నారు. అందుకే కాంగ్రెస్‌పై ప్రత్యక్ష దాడికి దిగారు. దానిని వంశపారంపర్య పార్టీగా, దేశంలో అన్ని అవలక్షణాలకు కారణంగా చెబుతూ ప్రజలను హెచ్చరిస్తున్నారు. అయోధ్యలో రామమందిరం తీర్పును తిరగతోడుతారంటూ హెచ్చరిస్తున్నారు. ముస్లిం రిజర్వేషన్లు వస్తాయని కూడా హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే మొదటి మూడు విడతల్లో జరిగిన ఎన్నికల్లో కర్ణాటక, కేరళ, తమిళనాడులో ఇండియా కూటమి ఎక్కువ సీట్లు గెలిచే అవకాశం ఉంది. అదే సమయంలో గుజరాత్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, అస్సాం, ఉత్తరాఖండ్, యూపీలో బీజేపీ బలంగా ఉంది. ఈ రాష్ట్రాల్లో 127 స్థానాలు ఉన్నాయి. వీటిలో వందకు పైగా గెలుస్తామని ఎన్డీయే నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అలాగే తమిళనాడులో ఎన్డీయే కూటమి 5 నుంచి 10 సీట్లు సాధిస్తుందని, కర్ణాటకలో 15కు పైగా సీట్లు వస్తాయని అంచనా వేస్తోంది. తరువాత నాలుగు విడతల్లో జరగనున్న 260 స్థానాల్లో కనీసం 150 స్థానాల్లో గెలిచినా అధికారానికి ఢోకా లేదని బీజేపీ నేతలు అంచనా వేస్తున్నారు. నాలుగు, ఐదు, ఆరు, ఏడు విడతల్లో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, బీహార్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, పంజాబ్, తెలంగాణలు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోనే 54 స్థానాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 25 స్థానాలు ఉండగా.. ఇక్కడ టీడీపీతో కలిసి బీజేపీ పోటీచేస్తోంది. ఎన్డీయే కూటమికి ఏపీలో ఎక్కువ స్థానాలు వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ హోరాహోరీ తలపడుతుండగా డబుల్ డిజిట్ సాధిస్తామని బీజేపీ నేతలు చెబుతున్నా.. కనీసం 6 నుంచి 7 స్థానాలు తప్పకుండా సాధిస్తామని కమలం నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ లెక్కల ప్రకారం తక్కువలో తక్కువ తమకు 270 నుంచి 300 ఈజీగా వస్తాయని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఈ క్రమంలో చివరి నాలుగు విడతల్లో ఎక్కువ స్థానాలు సాధించడమే లక్ష్యంగా మోడీ ప్రచారం సాగుతోంది. అయితే చేసిన అభివృద్ధిని గట్టిగా చెప్పలేని దైన్యంలో ఉన్నారు. కాంగ్రెస్‌ను విమర్శించడమే లక్ష్యంగా ఆయన ప్రచారం సాగుతోంది. ఇది దేనికి సంకేతమన్నది జూన్ 4న ఫలితాలను బట్టి వెల్లడి అవుతుంది.

# ఫిరంగిలే సివంగీలైన వేళ..!



1857 మే 10న సిపాయుల తిరుగుబాటు ప్రారంభమ

మొబైల్ ఫోన్లు, వాట్సప్, ఇంటర్నెట్లు అందుబాటులో లేని రోజులవి. కాని ఒక పోరాటం మీరట్ నుండి ఢిల్లీ వరకూ ఉప్పెనలా పొంగింది. పాలకుల మోసాలు, దౌర్జన్యాలు, పన్నాగాలపై విసుగు చెంది హృదయంతరాళల్లో ఉద్రేకంతో, నరాలలో నెత్తురుమండి, బానిస గొలుసుల విముక్తికై నవ జీవన విప్లవ శంఖం పూరించి సివంగిల్లా కదం తొక్కడానికి ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ప్రజల ఆరాటమే ఈ పోరాటానికి కారణమై నాందయ్యింది. ఆ పోరాటమే 10 మే 1857 న ప్రారంభమైన సిపాయుల తిరుగుబాటు... ! భారతదేశ ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం....!

1857 సం.ముందే..

భూస్వామ్య ఉన్నత వర్గాలకు అనుకూలంగా ఉండి సామాన్య రైతుల ప్రయోజనాలను హక్కులను విస్మరించింది. రైతులను వారి భూముల నుండి వలన వారి భూమి, వనరులపై నియంత్రణను తిరిగి పొందాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రెవెన్యూ కలెక్టర్లను నియమించి, కౌలుదారులు, వడ్డీ వ్యాపారులను ప్రోత్సహించి, గిరిజన ప్రాంతాలను ఆక్రమించి, స్వదేశీ పరిశ్రమలను విధ్వంసం చేసి, పన్ను పోటులు పెంచి భూస్వాములుకు, వడ్డీ వ్యాపారులు ప్రయోజనాలకు అనుకూలంగా ఉండే ఈస్టిండియా కంపెనీ పాలన ఆకృత్యాలను భరించలేక పాలనకు వ్యతిరేకంగా రైతులు, చేతివృత్తులవారు, గిరిజనులు,అన్ని మతాలకు చెందిన ప్రజలు సమిష్టిగా తమను తాము రక్షించుకోవడానికి సాయుధ ప్రతిఘటనను ఎన్నుకున్నారు. వీటిల్లో సన్యాసి తిరుగుబాటు, వెల్లూరు తిరుగుబాటు, పైకా తిరుగుబాటు లాంటివి కొన్ని ముఖ్యమైనవి. చరిత్ర సృష్టించినదే మొదటి స్వాతంత్ర్య సంగ్రామం లేదా సిపాయిల తిరుగుబాటు.

రాజ్య సంక్రమణ విధానాన్ని ప్రవేశపెట్టారు.దీని మూలాన చాలా రాజ్యాలు కంపెనీ పాలయ్యాయి. ప్రభావితమైన రాజ్యాలలో సతారా, నాగ్‌పూర్, ఝాన్సీలు ఉన్నాయి. ఇంకా జైత్‌పూర్, సంబల్‌పూర్, ఉదయపూర్ రాజ్యాలు కూడా విలీనం చేయబడ్డాయి. 1850లో హిందూ వారసత్వ చట్టాన్ని మార్చి క్రైస్తవ మతంలోకి మారిన హిందువు తన పూర్వీకుల ఆస్తులను వారసత్వంగా పొందేలా చేసింది.

భారతీయులను క్రైస్తవ మతంలోకి మార్చాలని ప్రభుత్వం యోచిస్తోందని ప్రజలు విశ్వసించారు.పాశ్చాత్య విద్యా పద్ధతులను ప్రవేశపెట్టడం హిందువులతో పాటు ముస్లింలకు సనాతన ధర్మాన్ని నేరుగా సవాలు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, జమీందార్లు భూమిపై భారీ పన్నులు కంపెనీ అనుసరించిన కఠినమైన ఆదాయ సేకరణ పద్ధతులపై ఆగ్రహానికి గురయ్యారు. రుణదాతలకు అప్పు తీర్చలేక చాలామంది తరతరాలుగా కలిగి ఉన్న భూములను కోల్పోయారు. పారిశ్రామిక విప్లవం వలన బ్రిటీష్ తయారీ వస్తువులు దిగుమతి అయ్యాయి. ఇది స్థానిక పరిశ్రమలను, ముఖ్యంగా భారతదేశంలోని వస్త్ర పరిశ్రమను నాశనం చేసింది. హస్తకళల పరిశ్రమలు బ్రిటన్లో యంత్రంతో తయారు చేయబడిన చౌకైన వస్తువులతో పోటీ పడవలసి వచ్చింది. బ్రిటీష్ దళాలలో 87% క మంది భారతీయ సిపాయిలు ఉన్నా కూడా బ్రిటిష్ సైనికుల కంటే తక్కువస్థాయి వారీగా పరిగణించబడ్డారు. సిపాయిల వేతనాలలో వ్యత్యాసం చూపించారు.తిరుగుబాటుకు రాజకీయ, ఆర్థిక, సామాజిక మతపరమైన కారణాలు ఎన్నున్నా తక్షణ కారణం మాత్రం బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ 'ఎన్ఫీల్డ్ రైఫిల్స్' అనే తుపాకీలో ఆవు, పంది కొవ్వు పూసిన తూటాలను వాడటం. సిపాయిలు ఈ తూటాలను నోటితో ఒలిచి రైఫిళ్ళలో నింపాల్సి రావటంతో హిందూ ముస్లిం సిపాయిలు వాటిని వాడటానికి నిరాకరించారు. 29 మార్చి 1857లో బారక్‌పూర్‌లోని సైనిక పటాలంలో మంగళ్ పాండే అనే యువ సిపాయి ఎన్‌ఫీల్డ్ రైఫిల్‌ను ఉపయోగించడానికి నిరాకరించి కోపంతో తనపైఅధికారిపై ఆయుధాలతో దాడి చేశాడు.

మిగిలిన సిపాయిలు ఈ చర్య నుండి ప్రేరణ పొంది రెజిమెంట్లో ఉన్న సిపాయులందరూ అతనికి మద్దతు ఇచ్చారు. అప్పటికి ప్రాణాలతో బయటపడినా 8 ఏప్రిల్ 1857న మంగళ్ పాండేని ఉరితీశారు. 9 మే1857న మీరట్‌లో ఎన్‌ఫీల్డ్ రైఫిల్‌ను ఉపయోగించేందుకు నిరాకరించిన 85 మంది సిపాయిల యూనిఫాంను తొలగించి వారికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు. తిరుగుబాటు 10 మే1857న బ్రిటిష్ అధికారులకు వ్యతిరేకంగా మీరట్‌లో సిపాయిలు ఢిల్లీ వైపు కవాతు చేసి 11 మే 1857 నేడు ఢిల్లీ ఎర్రకోటకు చేరుకొని బహదూర్ షాను చక్రవర్తిగా ప్రకటించారు. లక్నోలో 4 జూన్ 1857న బేగం హజ్రత్ మహల్, 5 జూన్ 1857న కాన్పూర్లో నానా సాహెబ్, ఝాన్సీ గ్వాలియర్లలో లక్ష్మీ బాయి మరియు తాంతియాతోపే, బరేలీలో ఖాన్ బహదూర్ ఖాన్, అలహాబాద్ మరియు బనారస్ లలో మౌల్వీ లియాకత్ అలీ, బీహార్లో కున్వర్ సింగ్ నాయకత్వాలలో పోరాటాలు కొనసాగాయి. కొంతమంది వీర మరణం పొందారు. చాలా మంది జైలుపాలయ్యారు. తిరుగుబాటు సుమారు సంవత్సరానికి పైగా కొనసాగింది. ఈ పోరాటంలో ముఖ్యంగా పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లో రైతులు కంపెనీ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటులో చురుకుగా పాల్గొన్నారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తొలి ప్రతిఘటనలో దేవీ చౌధురాణి పాల్గొనడం మహిళల పాత్రను తెలియజేస్తుంది.అనేక కారణాల వల్ల అది 1858 మధ్యలో అణచివేయబడింది.

వైఫల్యానికి కారణాలు:

ఎగువ, మధ్య తరగతి మేధావి వర్గం తిరుగుబాటుకు పెద్దగా మద్దతు ఇవ్వలేదు. పెద్ద రాచరిక రాష్ట్రాలు, హైదరాబాద్, మైసూర్, ట్రావెన్‌కోర్, కాశ్మీర్, చిన్న రాజపుతానా రాష్ట్రాలు తిరుగుబాటులో చేరలేదు. దక్షిణ ప్రావిన్స్‌లు ఇందులో పాల్గొనలేదు. సమర్థవంతమైన నాయకత్వం లేదు. తగినన్ని ఆర్థిక వనరులు లోపించాయు. విద్యావంతులైన భారతీయులు తిరుగుబాటు యొక్క భూస్వామ్య వ్యవస్థకు భయపడి తటస్థంగా ఉండిపోయారు. బ్రిటిష్ కంపెనీ సైన్యం ఉపయోగించిన ఆధునిక ఆయుధాల ముందు భారతీయ సిపాయిల సాంప్రదాయ ఆయుధాలు పెద్దగా పోటీ ఇవ్వలేకపోయాయి. చక్రవర్తిగా ప్రకటించిన భహుదూర్ షా పోరాడే వయస్సులో లేకపోవడం కూడా ఒక కారణం.



**- జనక మోహన రావు దుంగ**
**8247045230**



## పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో వెలిశాల రాజేందర్ రావు గెలుపు

ఎల్కతుర్తి మే 09 (ప్రజామంటలు): కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్, మంత్రివర్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో వెలిచాల రాజేందర్ రావు ను భారీ మెజార్టీతో గెలిపించుటకు ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఎల్కతుర్తి ఎస్సీ కాలనీలో, ఎల్కతుర్తి %ర% గోపాల్ పూర్, క్లస్టర్ ఇంచార్జ్ గోలి రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో గడప గడపకు హస్తం గుర్తు ప్రచారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గొర్రె మహేందర్ ఎల్కతుర్తి గ్రామ శాఖ అధ్యక్షులు నాయకులు, బూత్ ఇన్చార్జులు:- శనిగరపు వెంకటేష్, పాక రమేష్, గొడిశాల రాజయ్య గౌడ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గోడిశాల నరేష్ గౌడ్, గ్రామ యూత్ అధ్యక్షులు అంబాల రాజు, కదారి సురేందర్, కోరే పున్నం,రాము, బిక్షపతి,సారయ్య, ఐలయ్య, మొగిలి, జగన్, రవి, యాదగిరి, రాజు, బోయాజ్, శనిగరపు సాహు, దామెర క్లస్టర్ ఇంచార్జ్, తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల అంగడి బజార్లో బిజెపి అభ్యర్థి అరవింద్ కు మద్దతుగా డా. బోగ శ్రావణి ప్రచారం



జగిత్యాల మే 09 (ప్రజామంటలు): భారతీయ జనతా పార్టీ లోక్ సభ ఎన్నికల్లో భాగంగా నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ధర్మపురి అరవింద్ కి మద్దతుగా జగిత్యాల పట్టణంలోని స్థానిక అంగడి బజార్ లో వ్యాపారస్తులను మరియు స్థానికులను కలిసి నరేంద్ర మోడీ అభివృద్ధి మరియు సంక్షేమ పథకాల గురించి వివరించి కమలం పువ్వు గుర్తుకు ఓటేసి నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ ని గెలిపించాల్సిందిగా అభ్యర్థించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జగిత్యాల పట్టణ అధ్యక్షులు మరియు కార్యవర్గ సభ్యులు మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి, బిఆర్ఎస్ కో హటావో

### ఆదివాసీకో బచావో: తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రాల రవీందర్



జగిత్యాల మే 09 (ప్రజామంటలు): ఈ నెల 13న జరుగనున్న పార్లమెంటు ఎన్నికలలో బిజెపి, బిఆర్ఎస్ లకు తగిన గుణ పాఠం చెప్పాలని తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రాల రవీందర్ ఆదివాసీలకు పిలుపు నిచ్చారు. గురువారం ఆయన జగిత్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాలలో పర్యటించారు. అనంతరం జగిత్యాలలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. ' బిజెపి, బిఆర్ఎస్ కో హటావో – ఆదివాసీకో బచావో' అనే నినాదంతో ఆదివాసీలను చైతన్య పరచడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ రెండు పార్టీల ప్రభుత్వాలు ఆదివాసీలకు తీరని అన్యాయం చేశాయని ఆరోపించారు. గత ప్రభుత్వం అటవీ హక్కుల చట్టాన్ని పూర్తిగా మింగేసిందన్నారు. కనీసం బ్రతకడానికి పోడు వ్యవసాయం చేసుకుంటే జైళ్ళ పాలు చేసిన ఘనత గత ప్రభుత్వానిదని విమర్శించారు. విద్యా – వైద్యం పై మాటలేదు, ఇకపోతే కేంద్ర ప్రభుత్వం మత ద్వేషాలను రెచ్చ గోడుతూ మనుషుల మధ్య కల్లోలాలు సృష్టిస్తూ, యువతను మత్తులో ముంచి రాజ్యం ఏలుతుందన్నారు. విద్యా వ్యవస్థను పూర్తిగా ప్రవేటు పరం చేసి ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు విద్యను దూరం చేస్తుందన్నారు. ఆదివాసీలకు జిఓ నంబర్ 3,1/70, ఏజెన్సీ చట్టాలను దూరం చేస్తుందన్నారు. ఇప్పుడైనా మనం కండ్లు తెరువక పోతే గతంలో అమలైన మణుధర్మ శాస్త్రం మూతికి ముంత ముడ్డికి చీపిరి కట్టుకొని బ్రతకాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఇప్పటికే అగ్రవర్ణ పేదలు అని ఉన్న రిజర్వేషన్ తుంగలో తొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ ల పిల్లలు 420 మార్కులు సాధిస్తే గాని నీట్ క్వాలి పై కావడం లేదన్నారు. దీన్ని బట్టి చూస్తే రిజర్వేషన్ ఎక్కడ ఉంది, ఎటుపోతుందని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి ప్రభుత్వాలు మనకు వద్దనుకొనే బిజెపి, బిఆర్ ఎస్ కో హటావో ఆదివాసీకో బచావో అనే నినాదంతొ ముందుకు పోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# గాంధీలో శిశువు విక్రయ కలకలం..!

### కొనుగోలు దారులను పట్టుకున్న సెక్యూరిటీ - పోలీసుల విచారణ





సికింద్రాబాద్ మే 09 (ప్రజామంటలు) : గాంధీ ఆసుపత్రిలో శిశువు విక్రయ ఘటన కలకలం రేపింది. వివరాలు ఇవి. ముషీరాబాద్ కు చెందిన అతియా సుల్తానా, మతీన్ సుల్తానా అనే ఇద్దరు మహిళలు గాంధీ ఆసుపత్రిలో ప్రెగ్నెసీతో ఉన్న కవిత అనే ఓ యాచకురాలిని గత నెల 24న అడ్మిట్ చేయించారు. 25న మగబాబుకు జన్మనివ్వగా 26న శిశువును తీసుకెళ్ళడానికి వీరిద్దరు ప్రయత్నించగా,పసిగట్టిన గాంధీ ఆసుపత్రి సెక్యూరిటీ అడ్డుకొని, చిలకలగూడ పోలీసులకు సమాచారం ఇచ్చారు. శిశువు కొనుగోలు దారులుగా ఉన్న ఇద్దరు అనుమానిత మహిళలను స్టేషన్కు తీసుకువెళ్ళి,పోలీసులు వారికి కౌన్సిలింగ్ ఇచ్చి, పంపించారు. ఈ క్రమంలో తిరిగి సదరు ఇద్దరు మహిళలు గురువారం గాంధీకి వచ్చి, మగ శిశువును తీసుకెళ్ళడానికి ప్రయత్నించారు. సెక్యూరిటీ సిబ్బంది వీరిని ప్రశ్నించి, వివరాలు అడిగారు. రూ 25 వేలకు తాము శిశువును కొనుగోలు చేయడానికి వచ్చామని, తాము మహిళ గర్భిణీని గాంధీలో అడ్మిట్ చేయించి, అన్ని రకాల సహాయ, సహకారాలు చేశామన్నారు. ఇందులో ఎవరిని బలవంతం చేయలేదన్నారు. తల్లి స్వచ్ఛందంగా తన శిశువును తమకు పెంచుకోవడానికి ఇవ్వడానికి ఒప్పుకుందన్నారు. తన శిశువును వారికిస్తే మీకు ఇబ్బంది ఏమిటని తల్లి సిబ్బందిపై ఆగ్రహించింది. సూపరింటెండెంట్ ప్రొ.రాజారావు జోక్యం చేసుకొని, పోలీసులకు కేసు నమోదు చేయాలని సూచించి, తల్లిని గాంధీ నుంచి డిశ్చార్జీ చేసి, శిశువును ఎన్.ఐ.సీ.యూ లో భద్రంగా ఉంచారు. శిశువుల పంపకాలకు గాంధీ ఆవరణలో అవకాశం లేదని సూపరింటెండెంట్ ప్రొ. రాజారావు స్పష్టం చేశారు. చిలకలగూడ పోలీసులు పూర్తి స్థాయి విచారణ చేస్తున్నారు.

## మానవత్వం చాటుకున్న 'ధర్మపురి చాంద్ భాయ్' పంచర్ షాప్ (జమాత్ సాతి)



జగిత్యాల జిల్లా ప్రతినిధి మే 09 (ప్రజామంటలు): ధర్మపురి,తీగల ధర్మారం కి చెందిన ఇద్దరు వ్యక్తుల పేర్లు ఒకేలా ఉండటంతో గత సంవత్సరం మే 31, 23 నుండి ఇప్పటి వరకు తీగల ధర్మారం కు చెందిన సబ్సిడీ డబ్బులు గ్యాస్ ఉపాధి హామీ మొత్తం విలువ 6082 అక్షరాల ఆరు వేల ఎనబై రెండు రూపాయలు ధర్మపురికి చెందిన అదే పేరు గల చంద్ భాయ్ అకౌంట్ లోకి రావడం వలన గమనించిన వ్యక్తి వారి వివరాలు తెలుసుకొని అట్టి డబ్బును సాక్షుల అధీనంలో తనకు అప్ప జెయ్యాలని నిర్ణయించుకున్నాడు. పరుల సొమ్ము పాము లాంటిది అనే సామెత మరియు ఇస్లాం నేర్పిన పాఠాలు, ఇతరుల సొమ్ము మనకు జీర్ణం కాదు అని తెలుసుకొని ఇ నిర్ణయం తీసుకున్న చంద్ భాయ్ (పంచర్ షాప్) ని మిత్ర యూత్ మిత్ర బృందం, పలువురు అభినందించినారు.

## మండల ప్రజలు 108, 102 వాహనాల సేవలు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా 108 ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్



భీమదేవరపల్లి మే 09 (ప్రజామంటలు): ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏఎన్ సి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా 108 ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ పాల్గొని ఆశా వర్కర్లకు ప్రెగ్నెన్సీ కేసుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 102 అంబులెన్స్ సేవలు ఉపయోగించుకోవాలని అన్నారు. ప్రెగ్నెన్సీ సమయంలో ఏదైనా అత్యవసరం ఏర్పడితే 108 అంబులెన్స్ సేవలు ఉపయోగించుకోవాలని అన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తులను కచ్చితంగా 108 వాహనంలో హాస్పిటల్ కు తరలించాలని వడ దెబ్బకు సంబంధించిన ప్రత్యేక ప్రాథమిక చికిత్స అందించడానికి వీలుగా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. భీమదేవరపల్లి మండల ప్రజలు 108, 102 వాహనాల సేవలు ఉపయోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్ఈవో రాజేశ్వర్ రెడ్డి, హెచ్.వి.ఎస్ రాజయ్య, రత్నభారతి, 108 జిల్లా అధికారి లక్ష్మణ్, స్టాప్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ శ్రీధర్, పైలెట్ పవన్ పాల్గొన్నారు.

## రేగోడు లో బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం నిర్వహించిన నాయకులు



రేగోడు మే 09 (ప్రజామంటలు): మండల కేంద్రమైన రేగోడు లో గురువారం బిఆర్ఎస్ పార్టీ. గ్రామ అధ్యక్షులు రాయచోటి సుభాష్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు జైరాబాద్ బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ ఓటు వేసి గెలిపించాలని ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి నర్సింలు, మాజీ సర్పంచ్ నర్సింలు, గోపాలకృష్ణ యాదవ్, మునిరుద్దీన్ , రాజు కమల్, బ్రహ్మయ్య, ఉప్పరి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ విత్తన నాణ్యతలో ముల్కనూర్ సొసైటీ కి అవార్డు




భీమదేవరపల్లి మే 09 (ప్రజామంటలు): జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో 3 రోజుల పాటు నిర్వహించిన 67 వ, మొక్కజొన్న వార్షిక సమావేశంలో ఉత్తమ విత్తన నాణ్యత ప్రమాణాలు పాటించే సొసైటీగా ముల్కనూర్ సొసైటీ కి అవార్డును ఐఐఎంఆర్ డైరెక్టర్ హెచ్ ఎస్ జార్జ్ బుధవారం ప్రధానం చేశారు. ఈ కార్యక్రమం ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేజ్ రీసెర్చ్ వారు ఆర్గనైజ్ చేశారు. ఈ సందర్భంగా భారతదేశంలో 200 రకాల హైబ్రిడ్ విత్తనాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సొసైటీ వ్యవసాయ అధికారి స్వామిరావు, ఆదర్శ రైతులు జిమ్మల భీమ్ రెడ్డి, చీకట్ల రాజయ్యలను ఐఐఎంఆర్ డైరెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ సైంటిస్టులు డా. డి.కె. యాదవ, డా. యస్.కె. ప్రదాన్, డా. టి.ఆర్ శర్మ, డి.డి.జి క్రాప్ సైన్స్, డా. రమేష్ కుమార్, నోడల్ ఆఫీసర్ సంఘ సహాయ వ్యసాయ అధికారి ముప్పు సాయికిరణ్ పాల్గొన్నారు.

## జీవన్ రెడ్డి గెలుపుకోసం

### 18 వార్డులో వార్డులో ఇంటింటి ప్రచారం



జగిత్యాల మే 09 (ప్రజామంటలు): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రజా నాయకుడు తాటిపర్తి జీవన్ రెడ్డి ని నిజామాబాద్ ఎంపీగా గెలిపించాలనిజగిత్యాల మున్సిపల్ మాజీ చైర్పర్సన్ ,మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.జగిత్యాల మున్సిపల్ పరిధిలోని 18 వ వార్డులో చిట్ల లత అంజన్న ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, పెద్ద ఎత్తున మహిళలు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఓటర్లకు కాంగ్రెస్ కరపత్రాలు పంచి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలను వివరిస్తూ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాటా ్లడుతూ నిజామాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం అభివృద్ధి చెందాలంటే జీవన్ రెడ్డిని ఎం.పీ. గా గెలిపిం ాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తిరెడ్డి, గౌతం రెడ్డి, నర్సిహ్మ రెడ్డి, రామనందం, లక్ష్మణ్, సదాశివరెడ్డి, సాయి, శ్రీనివాస్, కిషన్, హరిత, రజిత, తదితరులు పాల్గొన్నారు.

## షిరిడి సాయి మందిరంలో శ్రీ లలితా సహస్ర పారాయణం



జగిత్యాల మే 09 (ప్రజామంటలు): జిల్లా కేంద్రంలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం ఉదయం భజనలు, సామూహిక శ్రీ లలితా సహస్ర నామ పారాయణము, అన్నదానం, సాయింత్రం పల్లకి సేవ తదితర కార్యక్రమాలు జరిగాయి. ఈకార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, డా. సతీష్ కుమార్, నాగుల కిషన్ గౌడ్, మార కైలాసం, కమిటీ సభ్యులు సత్సంగ సభ్యులు, భక్తులు,సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం పాల్గొన్నారు.

# భావోద్వేగాల మాటలతో ఓట్లు అడుగుతున్న జీవన్ రెడ్డి

### ఏడ్చే మగవాణ్ణి నమ్మవద్దు
### పార్లమెంట్ ఎలక్షన్ లో కర్రు కాల్చి వాత పెడతారు
### రైతులకు క్వింటాలకు 500 ఎక్కడ..?
### జగిత్యాల్లో జీవన్ రెడ్డి కుటుంబ పాలన నడుస్తుంది
### ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



జగిత్యాల మే 09 (ప్రజామంటలు): జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ రమణ నివాసంలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.... జగిత్యాల మరియు కోరుట్ల నియోజకవర్గంలో రైతన్నలు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం సరైన సమయంలో కొనుగోలు చేయకపోవడం బాధాకరం అంతే కాకుండా ప్రైవేట్ వ్యాపారస్తులకు అమ్ముకునే విధంగా ప్రోత్సహిస్తున్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేసే విధానాన్ని అమలు చేసుకోవడం సివిల్ సప్లై అధికారులకు సరైనటువంటి ఆదేశాలు జారీ చేయకపోవడం దౌర్భాగ్యం.. పరిపాలన అస్తవ్యస్తంగా కొనసాగుతుంది వ్యవస్థ ఈరోజు ఒక్క జగిత్యాల లోనే కాదు రాష్ట్రమంతా ఇదే పరిస్థితి రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయలేక 50 శాతం ధాన్యం రైతులు ప్రైవేట్ వ్యాపారస్తులకు అమ్ముకుంటున్నారు .మిగతా 50 శాతం ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి...ప్రభుత్వం ఈరోజు ఐకెపి ద్వారానో లేకపోతే సొసైటీ ద్వారా రైతులు ధాన్యం రోడ్లమీద కల్లాలలో రాళ్ల వర్షాలకు తడుస్తూ రైతులు తీవ్ర నష్టం కలుగుతుంది అంతేకాకుండా హమాలి వద్దు జోకిన తర్వాత లేటుగా లోడింగ్ చేయడం వల్ల ధాన్యం వెయిట్ లాస్ అవడం జరుగుతుంది. అంతే కాకుండా, రైస్ మిల్లర్లు వారు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు అని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల హామీల్లో ఇస్తానన్న క్వింటాలుకు 500 బోనస్ ఎక్కడ.. ఇప్పటికీ రైతులకు ఇవ్వకపోవడం సిగ్గుచేటు..పార్లమెంట్ అభ్యర్థి జీవన్ రెడ్డి , ఎమ్మెల్సీగా ఉండి ప్రభుత్వంలో ఉండి.. రైతులను ఆదుకోకపోవడం.. రైతుల గురించి, మాట్లాడకపోవడం దౌర్భాగ్యం అన్నారు. మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ కరీంనగర్ నుంచి గ్రాడ్యుయేట్ ఎలక్షన్ ద్వారా ఎమ్మెల్సీగా ఎన్నికై ఉద్యోగస్తుల సాధబాధకుల గురించి, వారి సంక్షేమం గురించి మాట్లాడిన దాఖలు లేవు. జగిత్యాల్లో జీవన్ రెడ్డి కుటుంబ పాలన నడుస్తుంది: నీవు మాత్రం ఎమ్మెల్సీగా పోటీ చేస్తావు.. ఎమ్మెల్యేగా పోటీ చేస్తావు.. ఇప్పుడు ఎంపీగా పోటీ చేస్తావ్... మీ కుటుంబంలో అందరూ జడ్పిటిసిలు, ఎంపీపీలు, చైర్మన్లు ఉండాలా? మిగతా వారేమో ఉండకూడదు అనే ధోరణి జీవన్ రెడ్డి ది అన్నారు.జీవన్ రెడ్డి కుటుంబ సభ్యులు భావోద్వేగ ప్రసంగాలు చేస్తూ ప్రజల మనసును డైవర్ట్ చేస్తున్న వ్యక్తి జీవన్ రెడ్డి, నాకు ఎమ్మెల్సీ మాత్రమే ఉంది.. మిగతా పదవులు లేవు.. నా వయసు అయిపోయింది.. ఇలా ముసలి కన్నీరు కాలుస్తూ, భావోద్వేగాల ప్రసంగాలు బ్లాక్మెయిల్ రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తున్నాను అని బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు.ఏడిచే మగవాణ్ణి నమ్మవద్దు.. ఇలాంటి వ్యక్తులను ప్రజలు గమనించి తప్పకుండా ఈలాంటి వాళ్లకు రానున్న ఎంపీ ఎలక్షన్లో కర్రు కాల్చి వాత పెట్టనున్నారు అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ,జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్. రమణ జిల్లా పరిషత్ చైర్మన్ దావ వసంత , ఎక్స్ మినిస్టర్ రాజేశం గౌడ్, లోక బాపు రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అంబాల రాజు పిలుపు టిఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ గెలుపు



ఎల్కతుర్తి మే 09 (ప్రజామంటలు): ఎల్కతుర్తి మండలం ఇందిరానగర్ గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ గ్రామ అద్దక్షుడు అంబాల రాజ్ కుమార్ ఆధ్వర్యంలో మన టిఆర్ఎస్ పార్టీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ కారు గుర్తుకే ఓటు వేయాలని బ్యాలెటూ నమునా చూపిం చి 03వ నెంబర్ పైన ఓటు వెయ్యాలని గ్రామ ఉపాధిహమి కూలీల వద్దకు వెళ్లి ప్రచారం చేసి 50,మందికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమములో ఇందిరానగర్ టిఆర్ఎస్ పార్టీ గ్రామ అద్దక్షుడు అంబాల రాజ్ కుమార్, యూత్ ఉపాద్దక్షుడు సందేలా నరేష్ మాజీ వార్డ్ సభ్యులు కదారి సందీప్, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కదారి రాజారాం, సాత్తూరి ఐలయ్య బొంకురి రాజీవ్ గాంధీ, మిట్టపల్లి కొమురయ్య, కదారి స్వామి యాత్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు



రాయికల్ మే 09 (ప్రజామంటలు): ఎండల తీవ్రత దృష్ట్యా రాయికల్ మండలంలోని వీరాపూర్ గ్రామ శివారులోని నల్లగుట్ట వద్ద పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి కి మద్దతుగా వీరాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ జైనోద్దీన్ సుమారు 300 మందికి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఎండ వేడిమి నుండి ఉపశమనం పొందడానికి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అలాగే బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి చేతి గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంట్ కు పంపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దిండిగాల రామస్వామి గౌడ్, సోమ వెంకటేష్, దుంపల స్వామిరెడ్డి, సుందరగిరి గంగాధర్, దుంపల నర్సారెడ్డి, మహమ్మద్ మల్లిక్ అహ్మద్, షేక్ ఇస్మాయిల్, మాద నారాయణ, నీలి మహేందర్, చెదలు శంకర్, సోమ వెంకటస్వామి, నీలి ఆనందం, షేక్ మున్నా, మజీద్, కనికరపు శ్రీనివాస్, బైరి నర్సయ్య, బైరి రాజారాం, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

### అరవై ఏళ్ల అవినీతి పాలనకు చరమగీతం పాడి

# ప్రజలు బిజెపి ని గెలిపించాలి

### ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ



రాయికల్ మే 09 (ప్రజామంటలు): రాయికల్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అరవింద్ ధర్మపురి మద్దతుగా నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్ కి ముఖ్యఅతిథిగా వచ్చిన అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా గమరియు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి లు మాట్లాడుతూ.... కాంగ్రెస్ దేశ విచ్చినాన్ని కోరుకుంటుందని, 60 ఏళ్ళు ఈ దేశాన్ని పట్టి పిడించిన పార్టీ కాంగ్రెస్ అని, అరవై ఏళ్ల అవినీతి పాలనకు చరమగీతం పాడి ప్రజలు బిజెపిని గెలిపించిన తర్వాత నరేంద్రమోదీ నాయకత్వంలో అనేక విప్లవత్మక విజయాలు, సంక్షేమ పథకాలు తీసుకురావడం జరిగిందని, దేశ ప్రజలందరు బిజెపిని, మోదీ ని గుండెలల్లో పెట్టుకొని మూడోసారి ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారని, అది సహించలేని ఇటలీ కాంగ్రెస్ అబద్దపు ప్రచారాలు చేసుకుంటు, ఒక వర్గానికి కొమ్ముకాస్తుందని మండిపడ్డారు, తెలంగాణ, కర్ణాటకలో గ్యారంటీలా మోసంతో, 420 హామీలతో అధికారంలోకి వచ్చినట్టు దేశంలో కూడా రావాలని పన్నాగం పన్నుతుందని అన్నారు. 370 మల్లి అమలు చేసి కాశ్మీర్ ను పాకిస్తాన్ చేతిలో పెట్టాలని చూస్తుందని, మన ఐదు వందల ఏళ్ల నాటి కల రామమందిరం నిర్మాణాన్ని కూడా కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతుందని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రామమందిర తాళం బాబ్రీ చేతిలో పెట్టాలని చూస్తుందని, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కు ఈ ఎన్నికలతో ఓటుతో బుద్దిచెప్పి బొందపెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అధ్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ రావు, రాయికల్ పట్టణ అధ్యక్షులు కల్లెడ ధర్మపురి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పడాల తిరుపతి, కౌన్సిలర్ కల్లెడ సునీత, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు కొక్కు గంగాధర్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుర్మా మల్లారెడ్డి, జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి సామర్ల అంజలి, ఓబీసీ మోర్చా ఆశన్న, దళిత మోర్చా అధ్యక్షులు బన్న సంజీవ్, సీనియర్ నాయకులు మచ్చ నారాయణ, బూత్ అధ్యక్షులు, జిల్లా మరియు పట్టణ పదాధికారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా 16వ రోజు పండుగ



గొల్లపల్లి మే 09 (ప్రజామంటలు): గొల్లపల్లి మండలంలోని భీమ్ రాజుపల్లి గ్రామంలో కొలువుదీరిన శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు మూడు రోజులపాటు ఏప్రిల్ నెల 24న జరిగిన విషయం తెలిసిందే. ఈ వేడుకను పురస్కరించుకొని గురువారం 16వ రోజు పండుగ వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త చింతపండు తిరుపతిరెడ్డి శశికళ దంపతులు, ఆలయ చైర్మన్ బొమ్మన కుమార్ అధ్యక్షతన నిర్వహించిన పూజ కార్యక్రమాలువైభవంగా జరిగాయి. అర్చకులు నాగుల మల్యాల వీరాచారి, అయ్యోరి నరసయ్య, అనిల్ మంత్రోచ్చరణల మధ్య మూలవిరాట్ శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహానికి, పూలు, పండ్లు, పంచామృతములతో అభిషేకం చేశారు. అనంతరం బొడ్రాయి వద్ద శ్రీ లక్ష్మీ, భూలక్ష్మి, బొడ్రాయి అభిషేకం చేసి పట్టు వస్త్రాలు, తొడిగారు. ఈ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొమ్మన కుమార్, ప్రధాన కార్యదర్శి సాగర్, మాజీ సర్పంచ్ రేవెల్ల సత్యనారాయణ, సుజాత, లింగయ్య, కంది స్వామి, సింగారపు లచ్చయ్య, బొమ్మెన వెంకటేశం, సింగారపు మహేష్, పొట్ట తిరుపతి, శ్రావణ్ కుమార్, రాయలింగు, దూస శ్రీనివాస్, శాశ్వత కమిటీ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు,మహిళలు పాల్గొన్నారు.

### ఎంపీ అభ్యర్థి గడ్డం వంశిని భారీ మెజారిటీతో గెలిపించండి

### ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి

జగిత్యాల జిల్లా ప్రతినిధి మే 09 (ప్రజామంటలు): ఎండపెల్లి మండలం గుల్లకోట గ్రామంలో గురువారం రోజున నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే గడ్డం వివేక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలను కలిసి పెద్దపెల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## నారీ న్యాయ సమ్మేళనం రాష్ట్ర మహిళా కాంగ్రెస్



హైదరాబాద్ మే 09 (ప్రజామంటలు): లేక్ వ్యూ బంజారా ఫంక్షన్ హాల్ లో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సికింద్రాబాద్ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపు కొరకు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు అధ్యక్షతన, ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షురాలు పుస్తకాల కవిత లు కలిసి నారీ న్యాయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలంబ మరియు దానం నాగేందర్, ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ విజయ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దున్నపోతుకు గడ్డి వేసి బర్రెకు పాలు పిండితే వస్తాయా?

**రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది**

**ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలంటే కేంద్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రావాలి**

**హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వొడితల ప్రణవ్**



జమ్మికుంట మే 09 (ప్రజామంటలు): జమ్మికుంట మండలం మేడిపల్లి, కోరపల్లి. విలాసాగర్, వావిలాల గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి కరీంనగర్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ గారికి చేతి గుర్తుకు ఓటేసి గెలిపించాలని ప్రచారం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సెంటిమెంటుతో ప్రజలు ఓట్లు వేశారు. కానీ ఇప్పుడు పార్లమెంటు ఎన్నికల్లో మళ్లీ అలాంటి తప్పు చేయకూడదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు నెరవేర్చే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం మీద వుందని హామీ ఇస్తున్నాను. బిజెపి పార్టీ నాయకులు మీ ఇంటికి వచ్చి దేవుళ్ళ పేరు మీద ఓట్లు అడుగుతే మాత్రం వేయకండి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో సంక్షేమ పథకాలు అందరికీ అందుతాయని, రెండు రోజుల క్రితమే రైతుబంధును అందరి ఖాతాలో వేయడం జరిగిందని, ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15 లోపు రెండు లక్షల రుణమాఫీ కూడా చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికలు పూర్తికాగానే కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు ఇచ్చేలా చర్యలు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. దేవుడు ఫోటోలు పెట్టి అక్షింతలు పంపించుకుంటూ ఓట్లు అడిగే నాయకులకు తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. రామరాజ్యం, ఇందిరమ్మ రాజ్య స్థాపనకై కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఉపాధి కూలీలను కోరారు.

# కాంగ్రెస్ తోనే యువతకు భవిష్యత్

**హుజురాబాద్ కాంగ్రెస్ ఇంచార్జి వొడితల ప్రణవ్..**

**యువతకు కాంగ్రెస్ ప్రభుత్వంలో మంచి భవిష్యత్తు ఉంటుంది..**

**యువకులు రాజకీయాలకు వచ్చి సమాజ సేవ చేయాలి..**

**ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే 30వేల ప్రభుత్వ ఉద్యోగాలు..**



జమ్మికుంట మే 09 (ప్రజామంటలు): పార్లమెంట్ పోలింగ్ సమయం దగ్గర పడుతున్న సమయంలో హుజురాబాద్ కాంగ్రెస్ లో మరింత జోష్ పెరిగింది. వరుసగా బిఆర్ఎస్,బిజెపి పార్టీల నుండి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు.వీరికి హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ మాట్లాడుతూ.... సమాజంలో యువతకు రాజకీయాలలో మంచి భవిష్యత్తు ఉందని కాంగ్రెస్ ప్రభుత్వంలో యువతకు పెద్దపీట వేస్తుందని యువకులు రాజకీయాలకు ఆకర్షితులు సమాజం పట్ల సానుకూల దృక్పథంతో సేవ చేయడానికి ముందుకురావడం శుభపరిణామని, సేవ చేయడానికి ముందుకు వచ్చేవారికి కాంగ్రెస్ ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యత వుంటుంది అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోపే మహిళలకు ఉచిత బస్ సౌకర్యాన్ని కల్పించిందని అలాగే అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేసి ప్రజల పట్ల తమకున్న కమిట్మెంట్ ని చూపెట్టారని, హుజురాబాద్ అభివృద్ధి కాంగ్రెస్ తోటే సాధ్యమని నమ్మి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో హుజురాబాద్ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ ఇచ్చి హుజురాబాద్ అభివృద్ధికి మా వంతు సహాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమములో చిన్నాల కార్తిక్, చిన్నాల శ్రీకాంత్, రాకేష్, వినయ్, రంజిత్, రమణ, వంశీ, సాయి కృష్ణ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరినారు.

## ఆరు గ్యారెంటీల అమలుతో పేదలకు ఎంతో లబ్ది

**పీసీసీ మెంబర్ మర్రి ఆదిత్యా రెడ్డి**

**దానంకు మద్దతుగా ఇంటింటి ప్రచారం**



సికింద్రాబాద్ మే 09 (ప్రజామంటలు): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ కు మద్దతుగా పీసీసీ మెంబర్ మర్రి ఆదిత్యారెడ్డి ప్రచారం కొనసాగిస్తున్నారు. గురువారం సనత్ నగర్ నియోజకవర్గం బన్సీలాల్ పేట డివిజన్ లో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన ఇంటింటికి వెళ్ళి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకా సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ స్కీంలతో ప్రతి పేద కుటుంబానికి లబ్ది చేకూరుతుందన్నారు. మతం పేరుతో అఖండ భారతవనిని విభజించాలని కుట్ర పన్నుతున్న బీజేపీకి ఈ సారి ఎన్నికల్లో చావుదెబ్బ తప్పదన్నారు. దేశంలో ఇండియా కూటమి విజయం ఖాయమన్నారు. ప్రస్తుత లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కూడ కాంగ్రెస్ గెలవబోతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు విఠల్, అయూబా?న్, రజని, ఇబ్రహీం పటేల్, ఎలీషా, శైలేష్ గౌడ్, ప్రియాంక, హేమలత, ఇంతియాజ్, సత్తిభాయ్, సురేశ్, రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాగిరెడ్డి పల్లెలో జోరుగా కాంగ్రెస్ పార్టీ నాయకుల ప్రచారం



చిగురుమామిడి మే 09 (ప్రజామంటలు): చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లె గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నరాల రాజయ్య ఆధ్వర్యంలో గ్రామం లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వేలిచాల రాజేందర్ రావు ప్రచారంలో భాగంగా హమలి సంఘం కార్మికుల, ఉపాది హామీ కార్మికుల వద్ద ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పిటిసి సభ్యులు గీకూరు రవీందర్ మరియు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతి రెడ్డి హాజరై వారు మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్ల మెంట్ అభ్యర్థి వేలిచాల రాజేందర్ రావు గారిని గెలిపించుకోవాలని అన్నారు. రైతుల కోసం పనిచేసే ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అకాల వర్షానికి తడిచిన వడ్లను కొనుగోలు చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం దళారుల ప్రభుత్వం మా ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అనీ అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేంద్ర రావు ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు నరాల రాజయ్య, ఉపాధ్యక్షుడు మంద ఎల్లయ్య, గౌడ సంఘం మండల అధ్యక్షులు బొమ్మగాని వెంకటేష్, మత్స్య కార్మిక సంఘం అధ్యక్షులు గట్టు శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజా గౌడ్, పత్తి సదానందం, కల్వల రాజేశ్వరరెడ్డి, సుధాకర్ రెడ్డి, జెల్ల శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, కూన తిరుపతి, నూనె కుమార్, బరిగేల రాజయ్య, వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లో చేరిన యువకులు



గొల్లపల్లి మే 09 (ప్రజామంటలు): గొల్లపెల్లి మండలం ఇస్రాజ్ పల్లి గ్రామానికి చెందిన 50 మంది యువకులు మాజీ సర్పంచ్ చిర్ర గంగాధర్ ఉపసర్పంచ్ కొండ వెంకటేష్ గౌడ్ ఆద్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ నుండి 50 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు .వారిని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ఇట్టి కార్యక్రమంలో ఓర్పుల లచ్చన్న సాన కొమురయ్య ఓర్పుల రవి బైరం రవి కందుకూరి శ్రీనివాస్ కొండ మారుతి కొక్కుల జలంధర్ లింగంపల్లి భూమయ్య, చిర్ర సత్యం, చిర్ర మల్లేష్, ఎటవేని శ్యామ్, చిర్ర రాజు, ఓర్పుల మధు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎం.పీ. ఎన్నికల బరిలో ప్రైవేట్ ఉద్యోగి 'ఉత్తమ్ ప్రవీన్'

## పేదల సేవకై ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ



సికింద్రాబాద్ మే 09 (ప్రజామంటలు): దశాబ్దాల తరబడిగా తలరాత మారని పేదవర్గాల ప్రజలకు సేవ చేయాలనే పట్టుదలతో ముషీరాబాద్ లోని రాంనగర్ కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి ఉత్తమ్ ప్రవీణ్ కుమార్ ప్రస్తుత లోక్ సభ ఎన్నికల బరిలో నిలిచారు. తన ఇంటి వద్ద గురువారం మీడియాతో ఆయన మాట్లాడుతూ తన మనోభావాలను వివరించారు. సిటీలోని ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని రాంనగర్ కు చెందిన ఉత్తమ్ ప్రవీన్ కుమార్ (55) వీఎస్టీ ఇండస్ట్రీస్ లో చిరు ఉద్యోగి. మద్య తరగతి కుటంబానికి చెందిన ప్రవీన్ కుమార్ కు తల్లి, తండ్రులు శ్యామ్ రావ్, బాలమణి ప్రస్తుతం లేరు. గత కొన్నేండ్లుగా పేదలకు ఏదో సాయం చేయాలనే తలంపుతో ఉత్తమ్ ప్రవీన్ కుమార్ పలు ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తూ వస్తున్నారు.



గతంలో రాంనగర్ డివిజన్ జీహెచ్ఎమ్సీ కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీచేశారు. అలాగే గత అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా అభ్యర్థిగా పోటీ పడ్డారు. ఇక తాను పనిచేస్తున్న వీఎస్టీ ఇండస్ట్రీస్ లో ఎంప్లాయిస్ యూనియన్ ఎన్నికల్లో కార్మిక నాయకుడిగా పోటీచేశారు. ప్రవీన్ కు భార్య సుకేశిని, ఇద్దరు పిల్లలున్నారు. తాను ఇప్పటి వరకు చాలా సార్లు వేసవిలో చలివేంద్రాలను ఏర్పాటు చేశానని, స్కూల్ విద్యార్థులకు నోటుబుక్కులు, ఆసుపత్రులకు రోగులకు పండ్లు, కోవిడ్ పాండమిక్ లో నిత్యవసరావస్తువుల పంపిణీ చేశానన్నారు. వృద్దులకు పలు సహాయక కార్యక్రమాలను అమలు చేశానన్నారు. ప్రస్తుతం ప్రజలు తనను దీవించి, తన స్కూల్ బ్యాగ్ గుర్తుకే ఓటు వేసి గెలిపిస్తే, పార్లమెంట్ లో తన గొంతును వినిపించి, పేదల బతుకులను మారుస్తానని ఉత్తమ్ ప్రవీన్ కుమార్ పేర్కొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణకు కవచం కాంగ్రెస్తెలంగాణ

## అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్

భీమదేవరపల్లి మే 09 (ప్రజామంటలు): కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగానికి కవచం లాంటిదని, బడుగు బలహీన ప్రజల పక్షాన ఉండి వారి అభివృద్ధికి కృషి చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, ఎస్సీ కార్పొరేషన్, ఎస్టీ కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్ లకు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే లోన్లు మంజూరు కావడం జరిగిందని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన్య కార్యదర్శి చెప్యాల ప్రకాష్ అన్నారు. పది సంవత్సరాలు పరిపాలించిన బిజెపి ప్రభుత్వం అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ బడా కంపెనీలకు కొమ్ము కాస్తుందని అన్నారు. మరొకసారి బిజెపి ప్రభుత్వాన్ని గెలిపిస్తే సామాన్య , పేద ప్రజలు ఇబ్బందులకు గురి కావలసి వస్తుందని అన్నారు. అందుకే పార్టీలకు అతీతంగా పనిచేస్తున్న సంఘాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ప్రజలు కచ్చితంగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొన్నాల వినోద్ కుమార్, బొల్లంపల్లి ప్రకాష్, బుసమల్ల రాజు, గంగారపు రవి, వేముల జగదీష్, గిరిమల్ల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# కర్నూలు అభివృద్ధి ప్రస్తావన లేని జగన్ ప్రసంగం

**న్యాయరాజధాని, ప్రాజెక్టులపై జగన్ మౌనం**

**తాగునీటి సమస్య పరిష్కారానికి దక్కని హామీ**

**సిఎం జగన్ ప్రజల మనిషి అన్న బివై రామయ్య**



కర్నూలు,మే9 (ప్రజా మంటలు): ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జిల్లా సమస్యల పట్ల ఏమాత్ర ప్రస్తావన లేకుండా జిల్లా అభివృద్ధిపై మౌనరాగాన్ని ఆలపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కర్నూలు నగరంలోని ఎస్బిఐ సర్కిల్ వద్ద నిర్వహించిన బహిరంగ సభకు ఆయన హెలికాప్టర్ ద్వారా 11 గంటలకు ఎస్టీ బీసీ కాలేజ్ గ్రౌండ్ కు చేరుకున్నారు. అక్కడి నుంచి స్థానిక నాయకులతో ఆయన కొద్దిసేపు ముచ్చటించారు 11:30 గంటలకు బహిరంగ సభలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానంగా రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమం కార్యక్రమాలపై ప్రత్యేకంగా ఒక్కనించారు. కాగా జిల్లాలో పెండింగ్లో ఉన్న వివిధ గుండ్రేవుల, వేదవతి, ఇతర ప్రాజెక్టుల నిర్మాణాల గురించి ఏమాత్రం ప్రస్తావించలేదు. ముఖ్యంగా మూడు రాజధానుల ఏర్పాటు అంశంలో భాగంగా న్యాయ రాజధాని గురించి ప్రస్తావించకపోవటం గమనార్హం. కర్నూలు నగరంలో ప్రత్యేకించి తాగునీటి సమస్య పరిష్కారానికి సంబంధించి ఎలాంటి హామీ ప్రజలకు ఇవ్వలేదు. అభివృద్ధికి సంబంధించిన అంశాలను ఏమాత్రం ఆయన ప్రసంగంలో ప్రస్తావించకపోవడం జిల్లా అభివృద్ధి పట్ల ముఖ్యమంత్రి ఏవైనా ప్రకటన చేస్తారా? అన్న ఆసక్తితో ఉన్న ప్రజలకు ఆ విషయంలో ఎలాంటి హామీ ఒక పోవడం స్థానిక ప్రజలను నిరుత్సాహ పరిచింది. ముస్లిం మైనార్టీలకు రాష్ట్రంలో పెద్దపీట వేశామని నాలుగు శాతం రిజర్వేషన్ల విషయంలో వారికి అండగా నిలుస్తామని పేర్కొన్నారు. రాజకీయ రంగంలోనూ నాలుగు శాతం రిజర్వేషన్లను కేవలం విద్య రంగంలోనే కాదు రాజకీయ రంగంలోనూ అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల కోసం రూ 31 లక్షల 70 వేల కోట్లు 59 నెలల్లో ప్రజల ఖాతాలకు చేరవేశామని ఇది చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా తాము చేశామని చెప్పారు. ముస్లింలకు నష్టం కలిగించే సిఏఏ, ఎన్ఆర్సి, యుసిసి వంటి చట్టాలను ఎట్టి పరిస్థితుల్లో బలపరచమని, ముస్లింలకు అండగా ఉంటామని పేర్కొన్నారు. అభివృద్ధి జరగాలంటే ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కాలని కోరారు. స్థానికంగా కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఇంతియాజ్ ఉన్నత చదువులు చదివి ఐఏఎస్ అధికారిగా తన పదవిని స్వచ్ఛందంగా వదులుకొని ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చారన్నారు. అవినీతి మరకలు లేని ఇంతియాజ్ను ఓటేసి గెలిపించాలని కోరారు. పేద ప్రజలను సైతం ఢిల్లీకి పంపే పార్టీ వైసిపి అన్నారు. పేద వర్గాల నుంచి వచ్చిన బీసీ నాయకుడు బి వై రామయ్య అని అన్నారు. ఎంపీగా ఆయనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఏఎండి ఇంతియాజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తనను రాజకీయాల్లోకి ఆహ్వానించారని, జగన్ చేస్తున్న సంక్షేమ పథకాలను అభివృద్ధిని చూసి వైసిపిలోకి చేరానన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల మనిషి అని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది ప్రజల జీవితాల్లో ముఖ్యమంత్రి వెలుగులు నింపారన్నారు. మహిళల లో ఆర్థిక స్వావలంబన పెంపొందించారన్నారు. విద్యతోనే సమాజం మారుతుందని విశ్వసించి జగన్మోహన్ రెడ్డి విద్యారంగానికి వైద్య రంగానికి పెద్ద పీటవేశారన్నారు. అందులో భాగంగా అమ్మబడి, విద్యా కానుక, గోరుముద్ద, విద్యా దీవెన వసతి దీవెన, విదేశీ విద్య అంటే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. మహిళలకు చేయూత, భరోసా వంటి అనేక సంక్షేమ పథకాలను చేపట్టారన్నారు. లక్షలాదిమంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. ప్రభుత్వాన్ని ఇంటిగుమ్మం ముందుకు సెక్రటేరియట్, వాలంటరీ వ్యవస్థ ద్వారా తెచ్చిన ఏకైక ముఖ్యమంత్రి అని అన్నారు. మరోసారి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజారిటీతో కర్నూలు అసెంబ్లీ స్థానాన్ని ముఖ్యమంత్రికి గిఫ్టుగా అందజేయాలన్నారు. కర్నూలు పార్లమెంటు వైసిపి అభ్యర్థి బి వై రామయ్య మాట్లాడుతూ కర్నూలు గడ్డ వైసిపికి అడ్డా అని మళ్లీ 2019లో మాదిరిగానే 14 ఎమ్మెల్యే స్థానాలు, రెండు ఎంపీ స్థానాలను ముఖ్యమంత్రికి గెలిచి గిఫ్ట్గా ఇస్తామన్నారు. ఈ ఎన్నికలు నీతికి అవినీతికి, ధర్మానికి, అధర్మానికి జరుగుతున్న యుద్ధమని పేర్కొన్నారు. పూలే, అంబేద్కర్, గాంధీ ఆశయాల శిల్పం జగన్మోహన్ రెడ్డి అని చెప్పారు. అభివృద్ధి సంక్షేమం పథకాలు సామాజిక న్యాయం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు. అబద్దాలతో కాలం వెళ్లదీసే పార్టీ టిడిపి అని విమర్శించారు. ఎమ్మెల్యే ఎంఏ ఆఫీస్ ఖాన్ మాట్లాడుతూ ఇంతియాజ్ భాష మంచి మనిషి అని అలాంటి వ్యక్తిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత నగర ప్రజలపై ఉందన్నారు. బి వై రామయ్య నిత్యం స్థానికంగా ప్రజల మధ్య ఉండే వ్యక్తి అని సమస్యలు పరిష్కారం కావాలంటే వైసీపీకి ఓటేయాలన్నారు. టిడిపికి ఓటేస్తే బిజెపికి వేసినట్లేనన్నారు. నాలుగు శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పే బిజెపితో ఉంటూ మరోవైపు ముస్లింలకు న్యాయం చేస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. చేసిన అభివృద్ధిని చూసి మేలు జరిగి ఉంటేనే తనకు ఓటేయాలని చెప్పే ధైర్యం ఉన్న నాయకుడు జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని అన్నారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో పేదలను అష్ట కష్టాలపాలు చేసిందన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీ తేడా లేకుండా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాల అందించిన ఏకైక ప్రభుత్వం వైసీపీ అన్నారు. రెండు బటన్లను నొక్కి జగనన్న రుణం తీర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసిపి రాయలసీమ కోఆర్డినేటర్ పొన్నం రామ సుబ్బారెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, మాజీ ఎమ్మెల్యే ఎస్వి మోహన్ రెడ్డి, కేడీసీసీ చైర్మన్ ఎస్.వి. విజయ మనోహరి, వైసిపి రాష్ట్ర నాయకులు అహ్మద్ అలీ ఖాన్, గడ్డం రామకృష్ణ పలువురు వైసిపి నాయకులు పాల్గన్నారు.

# స్టీల్ ప్లాంట్ కోసం అవినాశం పోరాడారా

**హత్యల కోసమే అధికారం వాడుకున్నారు - పులవెందుల ప్రచారంలో వైఎస్ షర్మిల**



పులివెందుల, మే 9 (ప్రజా మంటలు): ఎంపీగా అవినాష్‌రెడ్డి కడప స్టీల్ ప్లాంట్ కోసం ఒక్క ఉద్యమం కూడా చేయలేదని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. పులివెందులలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. హత్యలు చేయడానికే అధికారం వాడుకుంటున్నారు. అవినాష్ నిందితుడని సీబీఐ చేసిన ఆరోపణల ప్రకారమే మాట్లాడుతున్నాం. కాల్ రికార్డ్స్, గూగుల్ మ్యాప్స్ వంటి ఆధారాలన్నీ ఉన్నాయి. బాబాయిని చంపిన హంతకులనే సీఎం కాపాడుతున్నారు. జగన్‌కు అధికారమిచ్చింది ఆయన్ను కాపాడటానికేనా? అని ప్రశ్నించారు. ఒకప్పుడు అన్న కోసం పాదయాత్ర చేశా... ఇప్పుడు న్యాయం కోసం నిలబడ్డా. న్యాయం గెలుస్తుందా? నేరం గెలుస్తుందా? అని ప్రపంచమంతా చూస్తోంది. కడప ప్రజలు న్యాయాన్ని గెలిపించాలని కోరుతున్నా అని షర్మిల అన్నారు. తన తండ్రిని దారుణంగా హతమార్చారని మాజీ మంత్రి వివేకా కుమార్తె సునీత అన్నారు. న్యాయం కోసం పోరాడుతున్నామని చెప్పారు. ఈ పోరాటంలో కోర్టు తీర్పు చాలా ఆలస్యం కావొచ్చన్నారు. ప్రజా తీర్పు పెద్దదని.. దానికోసం షర్మిల ఎంపీగా పోటీ చేస్తున్నారని చెప్పారు. 'వైఎస్ అవినాష్‌రెడ్డి రేపో మాపో జైలుకు పోతారు. జైలుకు పోయేవారు కాదు.. జనాల్లో ఉండేవాళ్లు రావాలి. షర్మిలను గెలిపించి వివేకా ఆత్మకు శాంతి కలిగించండి' అని సునీత కోరారు.

# పోలవరాన్ని పక్కన పడేసిన జగన్

**టిడిపి ఉంటే..ఈపాటికే పూర్తయ్యేది:దేవినేని ఉమ**



ఏలూరు,మే9 (ప్రజా మంటలు): 72 శాతం పోలవరం ప్రాజెక్టును టీడీపీ పూర్తి చేస్తే.. జగన్ ప్రభుత్వం దానిని నిర్వీర్యం చేసిందని దేవినేని ఉమా మండిపడ్డారు. జిల్లాలోని బుట్టాయిగూడెం మండల టీడీపీ కార్యాలయంలో కూటమి నేతలు గురువారం సమావేశమయ్యారు. టీడీపీ మాజీ మంత్రి దేవినేని ఉమ, పోలవరం జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజు , టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవినేని ఉమా మాట్లాడుతూ.. పోలవరం పూర్తి అయితే లక్షల ఎకరాలకు సాగు, త్రాగు నీరు అందుతుందన్నారు. జగన్ ప్రభుత్వంలో ప్రాజెక్టులు అన్నీ పడకేసాయని విమర్శించారు. ప్రాజెక్టు సమాచారం బయటకు వెళ్లకుండా అడ్డుకట్ట వేశారని మండిపడ్డారు. టీడీపీ హయాంలో పోలవరం ప్రాజెక్టు సందర్శన ఏర్పాటు చేశామన్నారు. నిర్వాసితులకి జగన్ రూ.19 లక్షలు ఇస్తామని మాట ఇచ్చి తప్పారన్నారు. నిర్వాసితులకు ఏం న్యాయం చేశారని ప్రశ్నించారు. 5 వేల కోట్లు మంజూరు అయిన చింతలపూడి ఎత్తి పోతల పథకాన్ని గాలికి వదిలేశారన్నారు. రాష్ట్రంలో పలు సమస్యలు పరిష్కరించాకే ఓటు అడుగుతానని జగన్ అన్నారని.. అనేక సమస్యలు పెండింగ్‌లో ఉంచుకుని జగన్ ఓటు ఎలా అడుగుతారని దేవినేని ఉమా ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అభివృద్ధి జరిగితేనే ఓటేయమంటున్న జగన్

**అభివృద్ధిపై విపక్షాలకు అవగాహన లేదు - మీడియా సమావేశంలో సజ్జల విమర్శలు**



అమరావతి,మే9 (ప్రజా మంటలు): మంచి జరిగిందంటేనే ఓటేయమని సీఎం జగన్ ధైర్యంగా చెప్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఐదేళ్లలో ఏం చేశామో ఎప్పటికప్పుడు చెప్తూనే ఉన్నామన్నారు. నాలుగు రోజుల్లో ప్రజలు తీర్పు ఇవ్వబోతున్నారు. రాష్ట్రాభివృద్ధిపై ప్రతిపక్షాలకు అవగాహన లేదు. అభివృద్ధి జరగలేదని చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పౌర సేవలందిస్తున్నాం. రెండేళ్లు కరోనా సంక్షోభం ఉన్నా సంక్షేమ పథకాలు ఆపలేదు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, మార్పు వాళ్లకు కనిపించడం లేదు. ప్రతి సచివాలయం పరిధిలోనూ రూ. 20 కోట్ల నుంచి రూ.30 కోట్ల మేర సంక్షేమం అందింది' అని సజ్జల వివరించారు. బాబు హయాంలో డ్వాక్రా రుణాలు రద్దు చేయలేదు.. సున్నా వడ్డీ ఆపేశారు. పేదల కుటుంబాలు బాగుపడేలా సంక్షేమ పథకాలు అందించాం. 16 లక్షల మంది మహిళలకు చేయూత పథకం ద్వారా సాయం అందించాం. మహిళలకు రూ.75 వేలతో చేయూత కల్పించాం. పేదలు వారి కాళ్ల మీద వారు నిలబడేలా ప్రభుత్వం అండగా నిలిచింది. మహిళల పేరు మీదే 31 లక్షల ఇళ్ల పట్టాలు అందించాం. కియాను మించిన పరిశ్రమలు చాలా వచ్చాయి. ఇంకా వస్తూనే ఉన్నాయి. దేశ జీడీపీలో ఏపీ వాటా 4.82 శాతానికి పెరగడం అభివృద్ధి కాదా?' అంటూ సజ్జల ప్రశ్నించారు.

# ఉత్తరాంధ్ర ఆత్మగౌరవం తాకట్టు పెట్టిన బొత్స

**కరెంటు ఛార్జీలు, మద్య నిషేధంపై జగన్ జవాబుచెప్పాలి**

**చీపురుపల్లిలో నిర్వహించిన ప్రజాగళం సభలో చంద్రబాబు**



చీపురుపల్లి,మే9 (ప్రజా మంటలు): కరెంటు ఛార్జీలు, మద్య నిషేధంపై జవాబు చెప్పిన తర్వాతే జగన్ ఓట్లు అడగాలని తెదేపా అధినేత చంద్రబాబు డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా విజయనగరం జిల్లా చీపురుపల్లిలో నిర్వహించిన ప్రజాగళం సభలో చంద్రబాబు ప్రసంగించారు. ఉత్తరాంధ్ర ఆత్మగౌరవాన్ని బొత్స సత్యనారాయణ తాకట్టు పెట్టారని, పదవులన్నీ ఆయన కుటుంబానికేనని విమర్శించారు. మోదీ గురించి బొత్స కాదు.. దమ్ముంటే జగన్ మాట్లాడాలన్నారు. ప్రజల జీవితాలు మార్చేందుకే సూపర్ సిక్స్ తెచ్చామన్నారు. డ్వాక్రా సంఘాలు పెట్టింది నేనే.. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే బాధ్యత కూటమిదేనని భరోసా ఇచ్చారు. తోటపల్లి రిజర్వాయర్ పూర్తి చేసి నెలలోగా నీరిచ్చే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. బకాయిలతో కలిపి జులైలో రూ.7వేలు పింఛను ఇస్తామని ప్రకటించారు. ఉత్తరాంధ్ర తెదేపాకు కంచుకోట. ఈ ప్రాంతమంటే ప్రత్యేక అభిమానం. బటన్ నొక్కి ప్రజలకు ఇచ్చింది ఎంత.. జగన్ తిన్నదెంత? ఆయన చెప్పినవన్నీ అబద్ధాలే.. ఎప్పుడూ నిజం మాట్లాడరు. వంద సంక్షేమ కార్యక్రమాలు ఇచ్చిన పార్టీ తెదేపా. నిత్యావసరాలు, పెట్రోల్ ధరలు ఎందుకు పెంచారో చెప్పాలి? మీ భూములు, ఆస్తులపై ఎవరి ఫొటో ఉండాలి. భూ పత్రాలపై రాజముద్ర కావాలా.. జగన్ ఫొటో కావాలా? వైకాపాను ఓడిస్తే తప్ప మీ భూములకు భద్రత ఉండదు. సంక్షేమ కార్యక్రమాలు ఏమీ నిలిచిపోవు... మరింత పెంచుతాం. వచ్చే ఐదేళ్లు అద్భుతంగా పనిచేసి ప్రజల రుణం తీర్చుకుంటా. మేం వచ్చాక తొలి సంతకం మెగా డీఎస్సీపైనే. చీపురుపల్లిలో పరిశ్రమలు ఏర్పాటు చేసే బాధ్యత నాది. ఎప్పుడూ రైతు సంక్షేమాన్ని పట్టించుకునే పార్టీ మాది. అప్పు తెచ్చి బటన్ నొక్కడం జగన్ పని.. సంపద సృష్టించి పేదలకు పంచడం నా పని. రేపటి కురుక్షేత్ర యుద్ధంలో ధర్మం గెలవాలి. మీ జీవితాలు, మీ పిల్లల జీవితాలు మార్చే ఆయుధం ఓటు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

# ఊసరవెల్లి కన్నా అధ్వాన్నం చంద్రబాబు

**చంద్రబాబు బాగా ముదిరిపోయిన తొండ**

**ఓట్ల కోసం బాబు దొంగ ప్రేమ కురిపిస్తున్నాడు**

**గతంలో ఒక్క మంచి పనిచేయని బాబును నమ్మొద్దు**

**ముస్లిం రిజర్వేషన్లు రద్దుచేస్తామన్న బిజెపితో జతకట్టాడు**

**రూ.14, 165 కోట్ల చెల్లింపులకు ఈసీ బ్రేక్ వేయించేలా చేశారు**

**జగన్ వస్తేనే మళ్లీ సంఓేమం కొనసాగుతుంది**

**రాయలసీమ జిల్లాల్లో సిఎం జగన్ సుడిగాలి ప్రచారం**






అనంతపురం,మే9 (ప్రజా మంటలు): చంద్రబాబుది ఊసరవెల్లి రాజకీయమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. చంద్రబాబు బాగా ముదిరిపోయిన తొండ అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామన్న బీజేపీతో ఎలా జతకడతారని ప్రశ్నించారు. మరోవైపు మైనార్టీల ఓట్ల కోసం బాబు దొంగ ప్రేమ కురిపిస్తున్నాడని మండిపడ్డారు. ఆరునూరైనా ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కొనసాగించాల్సిందేనని స్పష్టం చేశారు. సిఎం జగన్ గురువారం రాయలసీమ జిల్లాల్లో సుడిగాలి ప్రచారం నిర్వహించారు. కర్నూలు, కళ్యాణదుర్గం, రాజంపేటల్లో ప్రచారంలో టిడిపి, కూటమిలపై విరుచుకుపడ్డారు. జగన్ గెలిస్తేనే సంక్షేమం సాగుతుందన్నారు. కల్యాణదుర్గంలో సీఎం జగన్ ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రూ.14, 165 కోట్ల చెల్లింపులకు ఈసీ బ్రేక్ వేసిందని.. టీడీపీ, బీజేపీ, జనసేన కుట్రతో పేదలకు నష్టం జరుగుతోందని దుయ్యబట్టారు. రైతులు, విద్యార్థులు, మహిళలకు డబ్బులు చేరకుండా కుట్ర చేయడంతో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించ కుండా మోకాలడ్డు పెట్టిందని మండిపడ్డారు. ఆసరా, చేయూత, ఈబీసీ నేస్తం పథకాల చెల్లింపులకు ఈసీ నిరాకరించిందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించకుండా చేసిందని సీఎం జగన్ తెలిపారు. తెలంగాణలో అనుమతిచ్చి ఏపీలో అనుమతివ్వలేదని గుర్తు చేశారు. 2019 పసుపు కుంకుమకి అనుమతిచ్చిన ఈసీ.. ఇప్పుడు నిరాకరించిన విషయాన్ని ప్రస్తావించారు. కూటమి ఒత్తిడి, ఫిర్యాదులతో ఈసీ నిరాకరించినట్లు విమర్శించారు. వైఎస్సార్ కల్యాణమస్తు పథకం చెల్లింపులకు ఈసీ అడ్డు చెప్పిందని, ఐదేళ్ల నుంచి అమల్లో ఉన్న పథకాల చెల్లింపులకు నిరాకరించినట్లు పేర్కొన్నారు. ఈసీ నియమించిన స్క్రీనింగ్ కమిటీ సిఫార్సు చేసినా నిరాకరించిందని తెలిపారు. కూటమి కుట్ర రైతులు, విద్యార్థులు, మహి ళ లకు శాపంగా మారిందని మండిపడ్డారు. చంద్రబాబును నమ్మడమంటే కొండ చిలువ నోట్లో తల పెట్టడమే నని.. పొరపాటున బాబుకు ఓటస్తే.. పథకాలు ముగింపే నని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా రాజంపేట రైల్వే కోడూరు రోడ్డులో ప్రచార సభలో మాట్లాడుతూ చంద్రబాబు.. మోదీ, అమిత్‌షాను తీసుకొచ్చి సభలు పెట్టించారు. ప్రత్యేక హోదా హామీ వస్తుందేమోనని ప్రజలు ఎదురుచూశారు.. వాళ్లు ప్రత్యేక హోదా హామీ ఇవ్వకుండా.. విమర్శించి వెళ్లిపోయారని అంటూ సీఎం జగన్ మండిపడ్డారు. చంద్రబాబు అంతటి అవినీతిపరుడు దేశంలోనే లేడని మోదీ అన్నారు. కూటమిలో చేరగానే అదే నోటితో చంద్రబాబును పొగుడుతున్నాడు. చంద్రబాబు, దత్తపుత్రుడికి ఏం కావాల్లో అది మాత్రమే మాట్లాడారు. పెత్తందార్ల కూటమిని వ్యతిరేకించండి' అంటూ సీఎం జగన్ పిలుపునిచ్చారు. గతంలో ఇదే కూటమి ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా నెరవేర్చారా?. చంద్రబాబు కూటమి.. పెత్తందార్ల కూటమి. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీష్ మీడియం తీసుకొస్తే.. వ్యతిరేకించారు. పెత్తందార్ల పిల్లలు మాత్రమే ఇంగ్లీష్ మీడియంలో చదువుకోవాలా? 59 నెలల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. మేనిఫెస్టోలోని 99 శాతం హామీలను నెరవేర్చాం. 2 లక్షల 31 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాం. అక్క చె÷-లలెమ్మలకు నేరుగా రూ.2 లక్షల 70 వేల కోట్లు అందించాం' అని సీఎం వివరించారు. గతంలో ఎప్పుడైనా ఇంత మంచి జరిగిందా?. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మార్చాం. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీష్ మీడియం తీసుకొచ్చాం. 3వ తరగతి నుంచే టోఫెల్ క్లాసులు, సబ్జెక్ట్ టీచర్లు. ప్రభుత్వ స్కూళ్లలో 6వ తరగతి నుంచే డిజిటల్ బోధన. ఇంటర్నేషనల్ యూనివర్శిటీలతో సర్టి÷ఫైడ్ కోర్సులు. పిల్లల చదువు కోసం తల్లులను పోత్సహిస్తూ అమ్మఒడి. విద్యారంగంలో జరిగిన విప్లవాలు.. గతంలో ఎప్పుడైనా జరిగాయా?. మహిళా సాధికారతకు అర్థం చెప్తూ అక్క చె÷-లలెమ్మలకు తోడుగా ఉన్నాం. మొదటిసారి మేనిఫెస్టో అనే పదానికి విశ్వసనీయత తీసుకొచ్చాం అని సీఎం జగన్ పేర్కొన్నారు. రాజంపేటలో అక్కచెల్లెమ్మల పేరిట 4వేల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్, ఇళ్ల నిర్మాణం..చేపట్టామని అన్నాడు. మరో 4 రోజుల్లో కురుక్షేత్ర మహాసంగ్రామం జరగబోతోంది..జరగబోయే ఈ ఎన్నికలు పథకాల కొనసాగింపును నిర్ణయించేవి.. మీ జగన్ తీసుకొచ్చినన్ని పథకాలు గతంలో ఎప్పుడైనా ఉన్నాయా? ఈ తరహాలో పేదవాడి మీద ధ్యాస పెట్టిన ప్రభుత్వం గతంలో చూశారా?ప్రత్యేకహోదాను అమ్మేశారు, పెత్తందార్ల కూటమిని వ్యతిరేకించండి..చంద్రబాబు ఎక్కడికి వెళ్తే అక్కడ దాన్ని జిల్లా కేంద్రం చేస్తా అంటున్నాడు.. రాజంపేట, మదనపల్లి, రాయచోటిలను జిల్లా కేంద్రం చేస్తానంటున్నాడు నమ్ముతారా అని ప్రశ్నించారు. రాజంపేటలో పింఛా డ్యాం ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తి చేశాం. అన్నమయ్య ప్రాజెక్ట్, గాలేరు -నగరి కాల్వ పనులు పూర్తి చేయాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి. రాజంపేట కేంద్రంగా అన్నమయ్య కాలేజ్‌ను యూనివర్శిటీగా తీర్చిదిద్దాం. మీ బిడ్డ తీసుకున్న నిర్ణయం రాజంపేట చరిత్రలో నిలిచిపోతుంది. అధికారంలోకి వచ్చిన తర్వాత రాజంపేటలో మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

# పార్లమెంట్‌లో కెసిఆర్ సైనికులు ఉండాలి

## అప్పడే తెలంగాణ గళం వినిపిస్తుంది - మల్కాజిగిరి ప్రచారంలో కెటిఆర్



హైదరాబాద్,మే9 (ప్రజా మంటలు): కేంద్రంలో ఉన్న సవతి తల్లిపై పోరాడాల్సి ఉంది.. నాలుగు ప్రాజెక్టులు రాష్ట్రానికి రావాలంటే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో కాదు. ఎందుకంటే వారు ఢిల్లీ గులామ్‌లు. ఇదే గులాబీ కండువా ఎగిరితే.. పార్లమెంట్‌లో మన గొంతు వినబడుతుంది. కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలంటేకే కేసీఆర్ సైనికులు పార్లమెంట్‌లో ఉండాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఓల్డ్ అల్వాల్‌లో ఏర్పాటు చేసిన యూత్ మీటింగ్‌లో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు అంటే.. ఇన్వర్టర్, జనరేటర్, క్యాండిల్ లైట్, టార్చ్ లైట్, పవర్ బ్యాంక్, ఛార్జింగ్ బల్బ్ అని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఉన్నంతకాలం కరెంట్ ఉండదు. పార్లమెంట్ ఎన్నికలు రాగానే.. బీఆర్ఎస్‌కు ఎందుకు ఓటేయాలని అడుగుతున్నారు. కేసీఆర్ 2001లో టీఆర్ఎస్ పార్టీ పెట్టినప్పుడు తెలంగాణ సాధించుకోవాలంటే పార్లమెంట్‌లో మనం శాసించే పరిస్థితి ఉండాలన్నారు. 17 ఎంపీలను గెలిపించాలన్నారు. రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు కలిసి కేసీఆర్ పార్టీ తెలంగాణలో 17 సీట్లు గెలిచినా.. ఢిల్లీలో బిల్లు పాస్ కావాలంటే 272 మంది మద్దతు ఉండాలి కదా..? తెలంగాణ ఎలా తెస్తాడు అని హేళన చేశారు. కానీ 2004లో ఐదుగురు ఎంపీలు గెలిచారు. కేసీఆర్ ఢిల్లీకి పోయి 32 పార్టీలకు చెందిన 272 మంది ఎంపీలను ఒప్పించి 2014లో కేసీఆర్ తెలంగాణను సాధించారు అని కేటీఆర్ తెలిపారు.కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు.. రాహుల్ గాంధీ, మోదీ చెప్పింది చేస్తారు. తెలంగాణ గురించి దమ్మున్న నాయకులే కొట్లాడుతారు. జూన్ 2వ తేదీ తర్వాత కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం చేసి తన గుప్పిట్లో పెట్టుకోవాలని ఆలోచన చేస్తున్నది. కేంద్ర పాలిత ప్రాంతం అయితే.. హైదరాబాద్ అభివృద్ధి ఆగిపోతుంది. ఒక్క చిన్న పని కూడా చేసుకునేందుకు అవకాశం ఉండదు. మోరీ, నాలా నిర్మించాలన్నా, రోడ్డు వేయాలన్నా ఢిల్లీకి పోయి అడగాలి. కేంద్ర పాలిత ప్రాంతం ప్రతిపాదనను అడ్డుకోవాలంటే గులాంబీ జెండా పార్లమెంట్‌లో ఎగరాలి. రాగిడి లక్ష్మారెడ్డి గెలవాలని కేటీఆర్ పేర్కొన్నారు.



# మెదక్‌లో వెంకట్రామిరెడ్డిదే విజయం

## రెండు,మూడో స్థానాలకు కాంగ్రెస్, బిజెపి పోటీ

## బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ధీమా



సిద్దిపేట,మే9 (ప్రజా మంటలు): తెలంగాణలో 6 గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయలేక అట్టర్ ఫ్లాప్ అయిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. కేవలం ఐదు నెలల కాలంలోనే రేవంత్ ప్రభుత్వం తీవ్ర ప్రజా వ్యతిరేకత తెచ్చుకుందని అన్నారు. బీజేపీ తెలంగాణకు మొండిచేయి చూపించిందని ఆరోపణలు చేశారు. ఆ పార్టీ కార్మికులకు వ్యతిరేకంగా, కార్పొరేట్లకు అనుకూలంగా పని చేస్తుందని విమర్శించారు. గురువారం హరీశ్‌రావు పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ద్వితీయ స్థానం బీజేపీనా, కాంగ్రెస్సా అనేది ఆ పార్టీలే తేల్చుకోవాలని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ మతం పేరిట ఓట్లు అడిగే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. మత రాజకీయాలు తెలంగాణలో నడవవని మండలించారు. కాంగ్రెస్ చేసింది చెబితే అభ్యంతరం లేదని కానీ చేయనివి కూడా చెబుతూ అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు, రుణమాఫీ అమలు చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారని ఇంతవరకు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఇప్పుడు దేవుళ్లమీద ఒట్లు పెడుతున్నారని.. ఇప్పుడు కూడా చెబుతున్నా పంద్రాగస్టులోగా ఆరు గ్యారంటీలు, రుణమాఫీ చేస్తే రాజీనామాకు తాను సిద్ధమని హరీశ్‌రావు మరోసారి సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి తన సవాల్‌ను స్వీకరించకుండానే డైలాగ్‌లు కొడుతున్నారని సెటైర్లు విసిరారు. పబ్బం గడుపుకునే రాజకీయాలు చేస్తూ కేసీఆర్ పట్ల రేవంత్ అనుచితంగా మాట్లాడుతునారని దుయ్యబట్టారు. రెండు జాతీయ పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. హిందువుల ఆస్తులు ముస్లింలకు ఇవ్వడం జరగదని.. రిజర్వేషన్లు తొలగించడం జరగదని చెప్పు కొచ్చారు. రెండు జాతీయ పార్టీలు ప్రజలను రెచ్చగొట్టడం ద్వారా రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూస్తున్నాయని ధ్వజమెత్తారు. రేవంత్ ప్రభుత్వం రివర్స్‌లో నడుస్తోందని ఎద్దేవా చేశారు. సిద్దిపేటలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్ షో ఉంటుందని ప్రకటించారు. ఈ రోడ్ షో ముస్తాబాద్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు ఉంటుందని వెల్లడించారు.

### కూకట్‌పల్లి ప్రాంతంలో తనిఖీల్లో 22 లక్షల నగదు స్వాధీనం

హైదరాబాద్,మే9 (ప్రజా మంటలు): ఎన్నికల నేపథ్యంలో భాగంగా బాచుపల్లి ఎస్ఓటీ, బాలానగర్ పోలీసులు సంయుక్తంగా వాహనాలను తనిఖీలు చేపట్టారు. కూకట్‌పల్లి పరిసరాల్లో చేపట్టిన తనిఖీల్లో రూ. 22 లక్షలను పోలీసులు గురువారం పట్టుకున్నారు. బాచుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ శ్రీకృష్ణనగర్ కాలనీకి చెందిన పి.అఖిల్, బోడుప్పల్ బుద్దానగర్‌కు చెందిన శశికిరణ్‌లు తెలంగాణ గోల్డ్ బయ్యర్స్‌లో మార్కెంటింగ్ చేస్తుంటారు. గురువారం బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తుండగా రెండు ద్విచక్ర వాహనాల్లో రూ. 22 లక్షలు లభించాయి.

# ముగిసిన పట్టబద్ర ఎమ్మెల్సీ నామినేషన్లు

## నేడు నామినేషన్ల పరిశీలన..27న ఎన్నిక

వరంగల్,మే9 (ప్రజా మంటలు): నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు గురువారంతో నామినేషన్ల గడవు ముగిసింది. మే10నుంచి నామినేషన్ల పరిశీలన ప్రారంభం అవుతుంది. 13 వరకు ఉపసంహరణ గడువు ఉంది. మే 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుండగా.. జూన్ 5న కౌంటింగ్ జరగనుంది. ఈ స్థానానికి పల్లా రాజేశ్వర్‌రెడ్డి 2021 మార్చిలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2027 మార్చి వరకు పదవీకాలం ఉంది. అయితే గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన బీఆర్ఎస్ నుంచి జనగామ ఎమ్మెల్యేగా గెలవడంతో ఎమ్మెల్సీ పదవికి డిసెంబరు 9న రాజీనామా చేశారు. ఈ క్రమంలో ఈసీ ఈ స్థానానికి షెడ్యూల్ రిలీజ్ చేసింది. ఈ ఉప ఎన్నికకు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేశ్ రెడ్డి, బీజేపీ నుంచి ప్రేమేందర్ రెడ్డిలు పోటీలో ఉన్నారు. ఉప ఎన్నిక జరిగే సెగ్మెంట్ పరిధిలో మొత్తం 12 జిల్లాలున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు తమ ప్రచారాన్ని మొదలుపెట్టారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు ఇప్పటికే వివిధ సంఘాలు మద్దతు ప్రకటించాయి. గతంలో ఆయన ఇండిపెండెంట్ గా పోటీ చేసి, రెండో స్థానంలో నిలిచారు. ప్రైవేట్ టీచర్లు, టీచర్ల సంఘాలు, యువజన సంఘాలతో అభ్యర్థులు చర్చలు చేస్తూ, తమకు మద్దతివ్వాలని విజ్ఞప్తులు చేస్తున్నారు.

### మోడీజీ మీ ఇడి,సిబిఐలు ఏం చేస్తున్నాయి : విమర్శలపై కెటిఆర్ ట్వీట్

హైదరాబాద్,మే9 (ప్రజా మంటలు): అదానీ, అంబానీలు కాంగ్రెస్ పార్టీకి టెంపోల నిండా డబ్బు పంపుతుంటే ప్రధాని మోదీకి అత్యంత ఇష్టమైన ఈడీ, సీబీఐ, ఐటీ ఎందుకు మౌనంగా ఉన్నాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీశారు. వేములవాడలో నిర్వహించిన బీజేపీ ఎన్నికల సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'తెలంగాణ గడ్డ నుంచి నేను ఒకటి అడగాలనుకుంటున్నా. గడచిన ఐదేండ్లుగా అదానీ, అంబానీలపై విమర్శలు గుప్పించిన కాంగ్రెస్.. ఎన్నికల ప్రక్రియ మొదలు కాగానే ఎందుకు మౌనం దాల్చిందో స్పష్టం చేయాలి. అదానీ, అంబానీ నుంచి ఎన్ని టెంపో లోడ్ల ధనం ముట్టింది..? ఏం ఒప్పందం కుదిరింది..? రాత్రికి రాత్రే అంబానీ, అదానీలపై ఆరోపణలు ఆగిపోయాయి' అని ప్రధాని మోదీ ప్రశ్నించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేటీఆర్ ఎక్స్ వేదిగా స్పందించారు. అదేవిధంగా నోట్ల రద్దు విఫల ప్రయత్నమని ప్రధాని మోదీ భావిస్తున్నారా అంటూ ప్రశ్నించారు.

# కరెంట్ కోతలపై ..కాంగ్రెస్ కోతలు

## ఇన్వర్టర్లు సిద్దం చేసుకోవాలంటూ కెటిఆర్ ట్వీట్

హైదరాబాద్,మే9 (ప్రజా మంటలు): రాష్ట్రంలో కరెంటు ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియడం లేదు. ఎండలు మండిపోతుండటంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతన్న వేళ ఎడాపెడా విద్యుత్ కోతలు విధిస్తున్నారు. రాష్ట్రంలో డిమాండ్‌కు సరిపోయినంతగా విద్యుత్ సరఫరా అవుతుందని కాంగ్రెస్ సర్కార్ చెబుతున్నప్పటికీ కరెంటు కోతలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వంపై సెటైర్లు వేశారు. ప్రజలంతా ఇన్వర్టర్లు, చార్జింగ్ బల్బులు, క్యాండిళ్లు, జనరేటర్లు, పవర్ బ్యాంకులు, టార్చిలైట్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఇవే కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇది బీఆర్ ప్రభుత్వం కాదని.. కాంగ్రెస్ సర్కార్ అని గుర్తుంచుకోవాలన్నారు. మే 13న ఆలోచించి ఓటు వేయాలని చెప్పారు.

# లోక్ సభ ఎన్నికల్లో అర్హులైన ఓటర్లను

## ఓటు హక్కు వినియోగించుకునేలా చూసే బాధ్యత అందరిది

### జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష





జగిత్యాల మే 09 (ప్రజామంటలు): మే 13న జరగనున్న లోక్ సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ అర్హతగల ప్రతి ఓటరును పోలింగ్ కేంద్రం దిశగా తీసుకువెళ్లి, ఓటు హక్కు వినియోగించుకునేలా చూసే బాధ్యత మనందరిపై ఉందని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాఅన్నారు.లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో గురువారం జిల్లా కలెక్టరేట్ లో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ టిఎస్ దివాకర, రెవెన్యూ అదనపు కలెక్టర్ పి. రాంబాబు తో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మే 13న జరగనున్న లోక్ సభ ఎన్నికల వివరాలు వెల్లడించడంతో పాటుగా, జిల్లాలో ఓటింగ్ శాతం పెంచడానికిగాను చేపట్టిన ఒక వినూత్నంగా 'ఓట్ల పర్వం-ఓటే సర్వం' అనే నినాదంతో కూడిన కార్యక్రమంను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎన్నికల అధికారి, కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ...ఈ లోక్‌సభ ఎన్నికల్లో గతంలోకన్నా ఎక్కువ ఓటింగ్ శాతం పెంచడానికే ఈ కార్యక్రమం ఆవిష్కరించడం జరిగిందన్నారు.జిల్లా లోని మూడు నియోజకవర్గాలలో ఎక్కువగా ఓటింగ్ శాతం నమోదైన చోట సంబంధిత వ్యక్తులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు.అలాగే, జగిత్యాల జిల్లా లోని మూడు నియోజకవర్గాలు ఉండగా, 7,12,710 మంది ఓటర్లున్నారని వివరించారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం లోని జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ సెగ్మెంట్లలో 4,81,924మంది ఓటర్లుండగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ లో 3,70,460 మంది ఓటర్లున్నారని వివరించారు. ఇంకా జిల్లా లొని 782 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని, సుమారు 990 సిసి కెమెరాలు ఏర్పాటు గావిస్తున్నామని వివరించారు. అంతేగాకుండా, జిల్లాలో 36 థిమాటిక్ పోలింగ్ కెంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# బిజెపి గెలిస్తే ఇవే చివరి ఎన్నికలు

## ఇక దేశంలో ఎన్నికలు లేకుండా నిరంకుశం - కోల్‌బెల్ట్ ప్రచారంలో ప్రొఫెసర్ కోదండరామ్



రామగుండం,మే9 (ప్రజా మంటలు): మోదీ ప్రభుత్వం సంపన్నులకు కొమ్ము కాస్తుందని టీజేఎస్ అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఎంపీ ఎలక్షన్లలో బీజేపీ గెలిస్తే మళ్లీ ఎన్నికలు రావు అని అన్నారు. బడుగు, బలహీన వర్గాలు అధికారం పొందాలంటే ఓటుతో ఢిల్లీ సర్కార్ ను దించాలని పిలుపునిచ్చారు. పెద్దపల్లి పార్లమెంటు అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ తరపున చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్సీ వెంకట్రావ్, ఏఐటీయూసీ నేత వాసిరెడ్డి సీతారామయ్య, సీనియర్ జర్నలిస్టు మునీర్ తో కలిసి జైపూర్ మండలం ఇందారం ఓపెన్ కాస్ట్ బొగ్గు గనిపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రొఫెసర్?కోదండరామ్?మాట్లాడుతూ 'మోదీ రామాలయం గుడి కట్టి ప్రపంచంలో గుర్తింపు వచ్చిందంటున్నడు. దేశం అభివృద్ధి అయిదంటున్నడు. బీజేపీ వచ్చాక అదానీ, అంబానీ ఆదాయం పెరిగింది. వాళ్లకు పన్ను రాయితీ, పబ్లిక్ సంస్థలు, గనులు ఇచ్చిండు. వాళ్లను వెంట విమానంలో దేశదేశాలకు తీసుకవెళ్లి కాంట్రాక్టులు ఇప్పించిండు. మరి ప్రజల ఆస్తులు ఎందుకు పెరగలేదు. ఇన్కమ్ ట్యాక్స్ రద్దు చేశాడా. 10 ఏళ్ల లో ప్రజాల ఆదాయం తగ్గింది. పన్నులు 300 శాతం పెరిగింది, 58 లక్షల జీఎస్టీ పన్ను ముక్కు పిండి వసూలు చేసింది. ప్రజల ఖర్చులు పెరిగాయి కానీ ఆదాయం తగ్గుతుంది' అని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రూ.7 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలా తీయించారని చెన్నూరు వివేక్ వెంకటస్వామి అన్నారు. సింగరేణి కార్మికులను బీఆర్ఎస్ మోసం చేసిందన్నారు. 'ప్రధాని మోదీ రూ.16 లక్షల కోట్లు అదానీ, అంబానీలకు రుణమాఫీ చేశాడు. ప్రజలకు, రైతులకు ఏమి చేయలేదు. ప్రభుత్ రంగ సంస్థలు ఉండకుండా మోదీ కుట్రలు చేసిండు. ప్రశ్నించేవారిపై ఈడీ, ఐటీ దాడులతో అణిచివేయాలని చూస్తున్నరు. బీజేపీ విధానాలు రాజ్యాంగ వ్యతిరేకం. కేసీఆర్ ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తానని మోసం చేసిండు. ఈ ఏడాదిలోనే తెలంగాణలో 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తం. మందమర్రి స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి యువతకు ట్రైనింగ్ ఇస్తున్నం. .సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఆరు గ్యారెంటీల్లో ఐదింటిని అమలు చేశాం. ఎన్నికల కోడ్ తర్వాత మిగిలినవి అమలు చేస్తాం. రాహుల్ గాంధీ పాంచ్ న్యాయతో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుంది. వంశీని మీ సొంత కొడుకు, తమ్ముడు అనుకోని గెలిపించాలి' అని విజ్ఞప్తిచేశారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థివంశీకృష్ణ కార్మికుల కష్టసుఖాలు తెలిసిన వ్యక్తి అని మాజీ ఎమ్మెల్సీ బి.వెంకట్రారావు అన్నారు. 'బీజేపీకి ఎక్కువ సీట్లు వస్తే రాజ్యాంగం మార్చుతుంది. భవిష్యత్తులో ఎన్నికలు ఉండవు. కాకా వెంకటస్వామి దయ వల్లనే పెన్షన్ వచ్చింది. 1997లో రూ. 1,297 కోట్ల సింగరేణి నష్టాల్లో ఉంటే ఎన్టీపీసీ నుంచి రూ 450 కోట్లు రుణం ఇప్పించి సంస్థను కాపాడారు' అని గుర్తు చేశారు. వంశీకృష్ణ పార్లమెంటులో ఉంటే సింగరేణి కార్మికులకు న్యాయం జరుగుతుందని ఏఐటీయూసీ నేత వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. బీఆర్ఎస్ హయాంలో సింగరేణికి నష్టం జరిగిందన్నారు. మోదీ ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటు పరం చేస్తుండు. అదానీ, అంబానీలకు తక్కువకు అమ్ముతున్నడు. రామాలయం పేరుతో సెంటిమెంట్ తో లబ్ది పొందాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తోంది. ఆపార్టీకి 400 సీట్లు ఇస్తే రాజ్యాంగం మార్చుతారు. త్వరలో కొత్త గనులు రావాలి. ఇన్కమ్ ట్యాక్స్ రద్దు, సొంతింటి పథకం కోసం కాంగ్రెస్ సర్కార్ చొరవ చూపాలి. ఇండియా కూటమి అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను కార్మిక వర్గం భారీ మెజారిటీతో గెలిపించాలి' అని కోరారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com